# నమీబియా విప్లవనేత శామ్ నుజోమా కన్నుమూత



**విన్డోక్ :** నమీబియా విప్లవోద్యమ నాయకుడు, సామ్యవాద, మార్క్సిస్టు, లెనినిస్టు భావజాలంతో నమీబియా స్వాతంత్ర్యోద్యమాన్ని నడిపి దేశాన్ని పాలించిన, నమీబియా జాతిపిత శామ్ షఫిసునా నుజోమా కన్నుమూశారు. నమీబియా ప్రస్తుత దేశాధ్యక్షుడు నాంగోలో ముబుంబా ఆదివారంనాడు ఈ విషయం ప్రకటించారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆయనకు ఎన్నో అవార్డులు, గౌరవ పురస్కారాలు లభించాయి. లెనిన్ శాంతి బహుమతి, ఇందిరాగాంధీ శాంతిబహుమతి, హోచిమిన్ శాంతి బహుమతి లభించాయి. నమీబియా పార్లమెంటు ఆయనను ''నమీబియా జాతిపిత''గా తీర్మానించి పురస్కారాన్ని అందజేసింది.

ఒకగొప్ప విప్లవనేత, జాతిపిత మరణించారన్నారు. శనివారం అర్థరాత్రి దాటిన తర్వాత ఆయన కన్నుమూశారు. గడచిన మూడువారాలుగా విన్డోక్‌లోని ఆసుపత్రికలో చికిత్స పొందుతున్న నుజోమా ఈసారి మాత్రం కోలుకుని బయటకు రాలేకపోయారని ఆ దేశ అధ్యక్షుడు ముబుంబా పేర్కొన్నారు. ఆయన సంపూర్ణమైన జీవితాన్ని చవిచూశారని, దేశానికి దిశానిర్దేశం చేశారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన వయసు 95 సంవత్సరాలు. నమీబియా స్వాతంత్ర్యంకోసం సుదీర్ఘపోరాటం చేసి స్వాతంత్ర్యం సాధించి ఆ దేశాన్ని 15 సంవత్సరాలపాటు నడిపించి దిశానిర్దేశం చేసిన నాయకుడు శామ్ నుజోమా. 1990లో దక్షిణ ఆఫ్రికా నుండి నమీబియా స్వాతంత్ర్యం సంపాదించింది. ఈ స్వాతంత్ర్య సాధనకోసం 1960 ఏప్రిల్ 19న లో 'స్వాపో' (సౌత్ వెస్ట్ పీపుల్స్ ఆర్గనైజేషన్) సంస్థను స్థాపించి విముక్తి 40 సంవత్సరాలపాటు ఆయన విముక్తి ఉద్యమాన్ని నడిపించారు నుజోమా.

1929 మే 12వ తేదీన వాయువ్య నమీబియా ఒమిసతీ రీజియన్ ఎతుండా గ్రామంలో జన్మించిన నుజోమా బాల్యం నుండీ కుటుంబ బాధ్యతలు మోశారు. పశువులను మేపారు. మిషన్‌స్కూలు చదువు పూర్తిచేశారు. కోస్తాతీర పట్టణం వాల్విస్‌బేకు వెళ్ళారు. తర్వాత రాజధాని విన్డోక్ చేరుకున్నారు. దక్షిణాఫ్రికా రైల్వేలో పనిచేశారు. తెల్లజాతీయులు పాటించే జాతి వివక్ష వ్యతిరేక ఉద్యమంలో చేరి రాజకీయాలలో కొనసాగారు. దక్షిణాఫ్రికా నుండి స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు మిత్రులతో కలిసి స్వాపో విప్లవ పోరాట సంస్థను స్థాపించారు. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ ఆఫ్ నమీబియా (పిఎల్ఎఎన్)ను స్థాపించిన నుజోమా 1966 నుండి 1989 విరామం లేకుండా గెరిల్లా యుద్ధం కొనసాగించారు. ఒకవైపు గెరిల్లా యుద్ధం చేస్తూనే మరోవైపు ఓవంబోలాండ్ పీపుల్స్ ఆర్గనైజేషన్ (ఓపిఓ)ను స్థాపించి వలసవాద వ్యతిరేక రాజకీయాలలో కొనసాగారు. స్వతంత్ర నమీబియా ఆవశ్యకతను ప్రపంచం దృష్టికి తెచ్చారు. 1960లో ఒకసారి ఆయన అరెస్టయినప్పుడు తప్పించుకుని టాంజానియా పారిపోయి ఆ దేశంలో జాతివివక్ష,వలసవాద వ్యతిరేక నాయకుడు జూలియస్ నైరేరీతో సమావేశమయ్యారు. ఆయనతో ఆదానప్రదానాలు సాగించారు. స్వాతంత్ర్యం వచ్చాక 1990 మార్చి 21న జరిగిన ఎన్నికల్లో స్వాపో సంస్థ భారీ మెజారిటీతో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అలా 1990 నుండి 2005 వరకూ దేశాధ్యక్ష పదవిలో కొనసాగారు. తర్వాత పదవీ విరమణ చేశారు. ''వేర్ అదర్స్ వేవర్డ్'' శీర్షికతో తన జీవిత చరిత్రను గ్రంథస్థం చేశారు. ఆయన సంపూర్ణ జీవిత చరిత్ర మనకు వెబ్‌సైటులో లభిస్తుంది. ఆయన మృతికి పలువురు నాయకులు సంతాపాలు తెలియజేశారు.

# నెట్జారిమ్ నుండి ఇజ్రాయెల్ సైన్యం ఉపసంహరణ



**నెట్జారిమ్ :** గాజాను ఉత్తర–దక్షిణ ప్రాంతాలుగా విభజించే కీలక ప్రాంతం నెట్జారిమ్ కారిడార్ నుండి ఇజ్రాయెల్ సైన్యాలు వైదొలగాయి. సైన్యం నెట్జారిమ్ నుండి వైదొలగే ప్రక్రియ పూర్తికావడంతో ఉత్తరగాజాలోకి వందలమంది పాలస్తీనియన్లు కార్లు, జంతు వాహనాలపై కుటుంబ సామాగ్రితో తరలివెళ్ళడం ప్రారంభించారు. జనవరి 19వ తేదీ నుండి ఇజ్రాయెల్ – పాలస్తీనా మధ్య అమలులోకి వచ్చిన ఒప్పందం ప్రకారం నెట్జారిమ్ నుండి ఇజ్రాయెల్ సైన్యాలు వైదొలగుతున్నాయి. తొలుత పశ్చిమ కారిడార్ నుండి ఇజ్రాయెల్ సైన్యాలు వైదొలగాయి. ఈ ఒప్పందం ప్రకారం ఇప్పటివరకూ హమాస్ ఉగ్రవాద సంస్థ 21 మంది బందీలను ఇజ్రాయెల్‌కు స్వాధీనం చేయగా, ఇజ్రాయెల్ కూడా తన వద్ద జైళ్ళల్లో జీవితఖైదీలుగా శిక్షలు అనుభవిస్తున్న 566 మంది పాలస్తీనియన్లను విడుదల చేసింది. ఈ ఒప్పందం ప్రకారం ఇజ్రాయెల్ ఆరు వారాలలో 2000 మంది ఖైదీలను విడుదల చేయాల్సి ఉండగా, హమాస్ కూడా మొత్తం 33 మంది బందీలను విడుదల చేయాల్సి ఉంది. 2023 అక్టోబరు 7వ తేదీన హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడిచేశారు. ఒక మ్యూజిక్ ఫెస్టివల్‌పై దాడిచేసి 1,200 మందిని హతమార్చారు. మరో 251 మందిని బందీలుగా తీసుకుపోయారు. ఈ బందీలను అన్వేషించి విడుదల చేసే నెపంతో ఇజ్రాయెల్ సైన్యం గాజాను ధ్వంసం చేసింది. ఈ యుద్ధం ఆరంభంలో 7,00,000 మంది ప్రజలు ఉత్తర గాజా నుండి దక్షిణగాజాకు పారిపోయారు. ఈ యుద్ధంలో 61,709 మంది పాలస్తీనియన్లు మరణించారు. ఐతే హమాస్ అపహరించిన బందీలలో 79 మంది బందీల లెక్క తేలడంలేదు. ఇంకా 39 మంది బందీలు మాత్రమే సజీవులుగా ఉన్నారని భావిస్తున్నారు. మొదటి విడత కాల్పుల విరమణ ఒప్పందం మార్చి 2వ తేదీతో ముగుస్తుంది. తదుపరి ఒప్పందం పొడిగించేందుకు ఇప్పటినుండే చర్చలకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా గాజాలో మానవతా సహాయం చేసేందుకు గతనెల 19 నుండి ఇప్పటివరకూ 10 వేల ట్రక్కులలో ఆహారం, ఆయిలు, ఇతర వస్తువులు సరఫరా అయ్యాయి. అదేవిధంగా గాజాలో 2,00,000 లక్షల టెంట్లు, 60,000 తాత్కాలిక షెల్టర్లు ప్రజలు నివాసం ఉండటానికి అవసరమవుతాయి.






## చైనాలో విరిగిపడిన కొండచరియలు

### 30 మందిపైగా సజీవ సమాధి

సియాచున్ దక్షిణ చైనా సియాచున్ ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో 30 మంది సజీవ సమాధి అయ్యారు. ఇటీవలికాలంలో సియాచున్ ప్రాంతంలో ఆగకుండా కురిసిన భారీ వర్షాలు, వరదలకారణంగా కొండచరియలు బాగా నానిపోయి, ఈ చరియలు ఇప్పుడు ఆకస్మికంగా విరిగిపడ్డాయని, మృతులసంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందనీ ఆదివారం ఉదయం జరిగిన పత్రికాగోష్ఠిలోఅధికారులు చెప్పారు. కొండచరియల నుండి విరిగిపడిన బురదమట్టి, రాళ్ళు సుమారు 1.2 కిలోమీటర్ల మేరకు ఆవరించుకుని ఉంది. పది నుండి 20 మీటర్ల మందాన ఈ బురద పేరుకుపోయింది. దీని అడుగున మృతుల దేహాలు ఉన్నాయి. జున్‌లియన్ కౌంటీలోని జిన్‌పింగ్ గ్రామంలో ఈ దుర్ఘటన జరిగింది. సుమారు 1,00,000 క్యూబిక్ మీటర్ల మేరకు బురద బండరాళ్ళతో కూడిన మట్టి కొండలపైనుండి పడిందని చెప్పారు. ఈ ప్రాంతంలో పూర్తిస్థాయిలో సహాయ చర్యలు చేస్తున్నామని అధికారులు చెప్పారు. ఈ ఘటనలో గాయపడిన ఇద్దరిని విజయవంతంగా బయటకు తీసి ఆసుపత్రికి తరలించామనీ, వారు సజీవంగానే ఉన్నారనీ చెప్పారు. సజీవసమాధైన గ్రామస్థులకోసం అన్వేషణ జరుగుతోంది. తదుపరి ఈ ప్రమాదం విస్తరించకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలనీ, బాధితులకు తగిన చికిత్స అందించాలనీ దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్ అధికారులను ఆదేశించారు. తదుపరి భారీ ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలనీ, ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించిన అన్ని విభాగాలవారు ఆ ప్రాంతానికి వెళ్ళి తక్షణం నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

## కొసావో పార్లమెంటుకు కీలక పోలింగ్ పూర్తి



ప్రిష్టినా ఆగ్నేయ ఐరోపాదేశం కొసావో పార్లమెంటుకు ఆదివారంనాడు కీలకమైన ఎన్నికలు జరిగాయి. దేశంలో మొత్తం 20 లక్షలమంది ఓటర్లు ఉన్నారు. 2008లో సెర్బియా నుండి స్వాతంత్ర్యం పొందిన కొసా వో పార్లమెంటులో 120 సీట్లు ఉన్నాయి. నాలుగు సంవత్సరాలపాటు అధికారంలో కొనసాగే కొత్తపార్లమెంటుకు ప్రస్తుత ప్రధానమంత్రి అల్బిన్ కుర్తి రెండోసారి గెలిచేందుకు ఉవ్విళ్ళూరుతూ ఉండటంతో ఈసారి ఎన్నికలు ఆయనకు అత్యంత కీలకంగా మారాయి. డెమోక్రటిక్‌పార్టీ ఆఫ్ కొసావో (పిడికె) తరపున బెద్రిహమ్జా అధికార వెటెవెండోస్‌జే పార్టీ నాయకుడు ఆల్బిన్ కుర్తీని సవాలు చేస్తున్నారు. డెమోక్రటిక్ లీగ్ ఆఫ్ కొసావో (ఎడికె) నాయకుడు లుమిర్ అబ్ధిఖ్సుకు, ఫ్యూచర్ ఆఫ్ కొసావో అలయెన్స్ (ఎఎకె) నాయకుడు రముష్ అలదినాజ్ కూడా ప్రధానమంత్రి పదవికి పోటీ చేశారు. 2008లో కొసావో స్వాతంత్ర్యం పొందినప్పటినుండీ ఆరు ప్రభుత్వాలు మారాయి. ఐదుగురు ప్రధానమంత్రులు దేశాన్ని పాలించారు. వీరిలో ఏ ఒక్కరూ పూర్తికాలం పదవిలో కొనసాగలేకపోయారు. ఒక్క ఆల్బిన్ కుర్తి మాత్రమే నాలుగు సంవత్సరాలు పదవీకాలాన్ని పూర్తిచేసి రెండోసారి కూడా ప్రధానమంత్రి పదవికి పోటీపడుతున్నారు.

# మేక్ యూరప్ గ్రేట్ ఎగైన్

### మాడ్రిడ్‌లో మితవాదుల భారీ ర్యాలీ



మాడ్రిడ్ 'మేక్ యూరప్ గ్రేట్ ఎగైన్' అనే నినాదంతో యూరప్‌లో మితవాదపార్టీలు భారీ ర్యాలీ నిర్వహించాయి. ''మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్'' అనే ట్రంప్ నినాదాన్ని అనుకరిస్తూ యూరప్‌లో మితవాద పార్టీలు ఈ ర్యాలీ నిర్వహించాయి. వేలాదిమంది ర్యాలీలో పాల్గొన్నారు. స్పెయిన్ ప్రభుత్వ అధికార పార్టీ ఓక్స్ ఈ ర్యాలీకి ఆతిథ్యం ఇచ్చింది. నెదర్లాండ్స్‌కు చెందిన గ్రేట్ వైల్డర్స్ ఇటలీ లీగ్ పార్టీ హంగేరీ విక్టర్ ఆర్బన్ పార్టీ ఈ ర్యాలీ నిర్వహణలో కీలకపాత్ర పోషించాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధికారం చేబట్టిన తరువాత యూరప్ ప్రపంచం అభద్రతకు గురవుతోంది. టారిఫ్‌ల భయం కూడా వెంటాడుతోంది. ఆర్థిక వ్యవస్థ ట్రంప్ వల్ల సమస్యల్లో పడే ప్రమాదం వస్తోంది. గ్రీన్‌ల్యాండ్‌ను తన అధీనంలోకి తీసుకుంటానని ట్రంప్ బెదిరిస్తున్నారు. ఈ నేపథ్యంలో యూరప్‌లో అధికారంలో ఉన్న మితవాద ప్రభుత్వాలన్నీ ఏకమై ఈ ర్యాలీ నిర్వహించాయి. పచ్చిమితవాద యూరప్ దేశభక్తపార్టీలనీ ఈ ర్యాలీ ద్వారా తిరిగి ఏకమయ్యాయి. ''నిన్నటివరకూ మనం వినేవాళ్ళలాగానే మిగిలాం, కానీ ఈరోజు మనం ప్రధాన స్రవంతిలోకి వచ్చాం, భవిష్యత్తు మనది'' అని హంగేరీ ప్రధాన మంత్రి విక్టర్ ఓర్బాన్ ఈ ర్యాలీలో ప్రకటించారు. 8,15 శతాబ్దాలమధ్యకాలంలో ముస్లిం రాజుల నుండి లైబీరియన్ ద్వీపకల్పాన్ని స్వాధీనం చేసుకునేందుకు క్రైస్తవ చక్రవర్తులు చేసిన సాంస్కృతిక, సైనిక ప్రచారం తరహాలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు, తమకు మధ్య ముఖ్యంగా వలసవాదులను తరిమికొట్టే విషయంలో ఏకాభిప్రాయాలు ఉన్నాయని, యూరప్‌ను తిరిగి గొప్పగా తీర్చిదిద్దేందుకు ఆయన తమకు దిశానిర్దేశం చేశారనీ ఓర్బాన్ అన్నారు. గత ఏడాది యూరోపియన్ యూనియన్ పార్లమెంటులో ఉన్న మొత్తం 720 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఇందులో 86 స్థానాలను వివిధ యూరప్ దేశాలకు చెందిన మితవాద దేశభక్తులు గెలుచుకున్నారు. ఐతే జార్జ్ మెలోనీ నాయకత్వానగల మితవాద బ్రదర్స్ ఆఫ్ ఇటలీ, లీపెన్ పార్టీ ప్రతినిధులుగానీ ఈ ర్యాలీలో పాల్గొనలేదు.

## వర్సిటీల్లో ఆర్ఎస్ఎస్ భావజాలం

(మొదటి పేజీ తరువాయి)

పేదలకు ఉన్నత విద్య అందకుండా కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. యుజిసి మార్గదర్శకాలను ఉప సంహరించుకోవాలని, ఇందుకు అన్ని విద్యార్థి సంఘాలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉన్నదని వారు పిలుపునిచ్చారు. ''యుజిసి ముసాయిదా నిబంధనలు 2025 విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిపై దాడి'' అనే అంశంపైన ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్,బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఆదివారం రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి సభాధ్యక్షత వహించగా, ముఖ్యఅతిధులుగా ప్రొఫెసర్ హరగోపాల్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.కాశీం, అతిధులుగా ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు విరాజ్ దేవాంగ్, జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగరాజ్, ఎఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు రామ కృష్ణ పాండ, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.ఎ స్టాలిన్ హాజరయ్యారు.

**బిజెపేతర సిఎంలతో రేవంత్ రెడ్డి సమావేశాన్ని నిర్వహించాలి: ప్రొఫెసర్ ఖాశీం**

ప్రొఫెసర్ ఖాశీం మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బిజెపేతర రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులతో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో సమావేశాన్ని నిర్వహించి, యుజిసి నిబంధనలను ఉపసంహరించాలని తీర్మానం చేయాలని, ఆ తీర్మాన పత్రాన్ని సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రులందరూ ప్రధాని మోదీని కలిసి ఇవ్వాలని సూచించారు. యుజిసి నిబంధనలకు వ్యతిరేకంగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో కలిసి భారీ ధర్నా నిర్వహించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఇప్పటికీ విశ్వవిద్యాలయాల్లో నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయని, పదేళ్ల అధికారంలో ఉన్నప్పటికీ విశ్వవిద్యాలయాల్లో బిజెపి పట్టుసాధించలేకపోయిందని, అందుకే ఆర్ఎస్ఎస్ బావజాలాన్ని దృష్టిలో పెట్టుకుని యుజిసి నిబంధనలను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. సంఘ్ పరివార్ ఆలోచనలకు అనుగుణంగా విశ్వవిద్యాలయాలను నడిపంచాలని బిజెపి ప్రయత్నిస్తోందన్నారు.

**ఢిల్లీ కేంద్రంగానే పాఠ్యాంశాలు..అడ్మీషన్లు..నియామకాలు: ప్రొఫెసర్ హరగోపాల్**

అంతకుముందు ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ దేశంలో అందరికీ నాణ్యమైన విద్య అందుబాటులో లేకుండా, అసమానతల నేపథ్యంలో ఢిల్లీ, కలకత్తా, బెంగుళూరు తరహా గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కామన్ ఎంట్రెన్స్ పరీక్షలో ఎలా రాణిస్తారని ప్రశ్నించారు. ఇదే విషయమై ఇటీవల తమిళనాడులో 95 శాతం మార్కులను సాధించిన ఒక వైద్య విద్యార్థిని నీట్‌లో ఉత్తీర్ణత సాధించపోవడంతో ఆత్మహత్య చేసుకున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ బావజాలం ఆధారంగానే కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ఉపాధ్యాయులను నియమిస్తున్నారని ఆరోపించారు. కొత్త నిబంధనలు అమలులోనికి వస్తే ఇక పాఠ్యాంశాలు, అడ్మీషన్లు, నియామకాలను కూడా ఢిల్లీ నుంచే కొనసాగుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

**ఐక్య ఉద్యమాలతో మతోన్మాద శక్తుల మెడలు వంచాలి: తక్కలపల్లి శ్రీనివాస రావు**

తక్కలపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ వామపక్ష, దళిత,బహుజన అన్ని విద్యార్థి సంఘాలు ఐక్యంగా ఉద్యమించి మతోన్మాద శక్తుల మెడలను వంచాలని పిలుపునిచ్చారు. గతంలో ప్రభుత్వాలను పడగొట్టిన చరిత్ర విద్యార్థి పోరాటాలకు ఉన్నది తెలిపారు. అన్ని రాష్ట్రాలను తమ గుప్పిట్లో పెట్టుకునేందుకే రాష్ట్రాలపైన ఇడి,సిబిఐ, ఐటి దాడులతో దండయాత్ర చేస్తోందని విమర్శించారు. ప్రశ్నించేవారు ఎవ్వరూ లేకుండా దేశ వ్యాప్తంగా ఒక బిజెపి మాత్రమే ఉండేలా దాడులు పాల్పడుతోందన్నారు. ఆర్ఎస్ఎస్ బావజాలం కలిగిన వారికే పదవులు, పలు పోస్టులలో నియమిస్తున్నారని ఆరోపించారు. భవిష్యత్‌లో సంస్కృత భాష మాత్రమే నేర్చుకోవాలని, మహిళలకు ఇళ్లు, వంటింటికి సంబంధించిన ప్రత్యేక కోర్సులను ప్రవేశపెడుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు విరాజ్ దేవాంగ్, జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగరాజ్, ఎఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు రామకృష్ణ పాండ, జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.ఎ స్టాలిన్ మాట్లాడుతూ ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కేంద్రం ఒకొక్కటిగా తన అధీనంలోకి తీసుకుంటూ రాష్ట్రాలపై తన విధానాలను బలవంతంగా రుద్దుతోందని దుయ్యబట్టారు. భారతదేశంలోని విశ్వవిద్యాలయాలు కార్పొరేట్ శక్తుల లాభదయాక, హిందుత్వ ప్రచార సాధనంగా మారకుండా విద్యార్థులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సదస్సులో ఎఐఎస్ఎఫ్ జాతీయ ఆఫీస్ బేరర్స్ సంఘమిత్ర జెనా, కె. శివారెడ్డి, కబీర్, హమీమ్ హంజా,ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, మాజీ రాష్ట్ర కార్యదర్శి విజయ సారథి రెడ్డి, ఒయు రిటైర్డ్ జాయింట్ రిజిస్ట్రార్ ఎల్లేష్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు ఇటికాల రామకృష్ణష్ణ, బానోత్ రాఘురాం, గ్యార క్రాంతి, బరిగల వెంకటేష్, రాజు, రహమాన్, నాగజ్యోతి, రాష్ట్ర నాయకులు చైతన్య, వంశీ వర్ధన్ రెడ్డి, మచ్చ రమేష్, అన్వర్, పవన్, హరిష్, సంతోష్, శరత్, జనార్ధన్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా యుజిసి నిబంధనలను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సంఘమిత్ర జెనా ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సదస్సు ఆమోదించింది.

## నెత్తుటేర్లు

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారని ఆయన చెప్పారు. 'ఇప్పటివరకు 31 మంది నక్సలైట్ల మృతదేహాలను ఎన్‌కౌంటర్ స్థలం నుండి స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా, ఎకె47, ఇన్సాస్, ఎస్ఎల్ఆర్, .303 రైఫిల్స్, బారెల్ గ్రెనేడ్ లాంచర్లు (బిజిఎల్), పేలుడు పదార్థాలు వంటి భారీ ఆయుధాలను కూడా సంఘటనా స్థలం నుండి స్వాధీనం చేసుకున్నారు' అని అధికారి తెలిపారు. రాష్ట్ర డిఆర్‌జి చెందిన ఒకరు, ఎస్‌టిఎఫ్‌కు చెందిన మరొకరు ఈ కాల్పుల్లో మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారని ఆయన చెప్పారు. గాయపడిన ఇద్దరు జవాన్లు ప్రమాదం నుంచి బయటపడినట్లు సమాచారం. వారిని మెరుగైన వైద్య కేంద్రానికి హెలికాప్టర్ ద్వారా చికిత్స కోసం తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఘటనా స్థలానికి అదనపు బలగాలను తరలించామని, ఆ ప్రాంతంలో ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా నాయకత్వంలో మార్చి 2026 నాటికి రాష్ట్రం నక్సలిజం నుండి విముక్తి పొందుతుందని సిఎం సాయి అన్నారు. ఈ దిశలో భద్రతా దళాలు నిరంతరం విజయం సాధిస్తూ లక్ష్యాన్ని సాధించే దిశగా వేగంగా ముందుకు సాగుతున్నాయి. దేశం, రాష్ట్రం నుండి 'క్యాన్సర్' లాంటి నక్సలిజం అంతం కావడం ఖాయం అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. 'మన సైనికుల త్యాగం వృథా కాదు. మరణించిన వారి ఆత్మలు శాంతించాలని, మృతుల కుటుంబాలకు బలాన్ని అందించాలని, గాయపడిన జవాన్లు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను' అని సాయి అన్నారు. భద్రతా దళాలను ప్రశంసిస్తూ, డిప్యూటీ సిఎం విజయ్ శర్మ మాట్లాడుతూ, బీజాపూర్‌లోని జాతీయ ఉద్యానవనం ప్రాంతాన్ని నక్సలైట్లకు సురక్షిత స్వర్గధామంగా పరిగణించారని, అక్కడ 650 మందికి పైగా భద్రతా సిబ్బంది వివిధ వైపుల నుండి ప్రవేశించి 31 మంది నక్సలైట్లను వారి గుహలో హతమార్చారని అన్నారు. మరణించిన నక్సలైట్లందరూ యూనిఫాం ధరించి ఉన్నారని, వారి నుండి ఆటోమేటెడ్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారని ఆయన విలేకరులతో అన్నారు. ఇద్దరు జవాన్లు ఆపరేషన్‌లో అమరులయ్యారన్నారు. విష్ణు దేవ్ సాయి ప్రభుత్వం ఎల్లప్పుడూ వారి కుటుంబాలకు అండగా ఉంటుందని, గాయపడిన ఇద్దరు జవాన్లను (రాయ్‌పూర్‌కు) విమానంలో తరలించారని ఆయన చెప్పారు. నక్సలిజాన్ని అంతం చేయడానికి మార్చి 2026 గడువు గురించి అడిగినప్పుడు, శర్మ మాట్లాడుతూ, 'కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సిఎం సాయి మార్గదర్శకత్వంలో, లక్ష్యం సాధించబడుతుంది' అని అన్నారు. 'బస్తర్ అభివృద్ధి మార్గంలో నక్సలైట్లు వేసిన ఐఇడిలు (ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైసెస్) తొలగిస్తామని, పాఠశాలలు, ఆసుపత్రులు, నీరు, రోడ్లు, అంగన్‌వాడీలు (ప్రభుత్వం నిర్వహించే మహిళలు మరియు పిల్లల సంరక్షణ కేంద్రాలు), మొబైల్ టవర్లు వంటి ప్రాథమిక సౌకర్యాలు మొత్తం ప్రాంతానికి చేరేలా పూర్తి నిబద్ధతతో పనిచేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు రాష్ట్రంలో హతమైన 81 మంది నక్సలైట్లలో, బీజాపూర్‌తో సహ ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్‌లో 65 మంది మరణించారు. గత సంవత్సరం, ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ప్రత్యేక ఎన్‌కౌంటర్లలో 219 మంది నక్సలైట్లను భద్రతా దళాలు మట్టుబెట్టాయని పోలీసులు తెలిపారు. గత సంవత్సరం అక్టోబర్ 4న, బస్తర్ ప్రాంతంలోని నారాయణ్‌పూర్–దంతేవాడ అంతర్‌జిల్లా సరిహద్దులోని అభుజ్‌మాడ్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ తరువాత 38 మంది నక్సలైట్లు మరణించారు.

## రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం ఢిల్లీకి వెళ్లిన బీరెన్ సింగ్ బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలతో సమావేశమయ్యారు. అనంతరం మణిపూర్ వెళ్లిపోయిన ఆయన.. సాయంత్రం గవర్నర్‌ను కలిసి రాజీనామా లేఖను అందించారు. ఈయన వెంట పలువురు బిజెపి నాయకులు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు రాష్ట్రానికి సేవ చేయడం గౌరవంగా భావిస్తున్నానని బీరెన్ సింగ్ తన లేఖలో పేర్కొన్నారు. మణిపూర్ ప్రజల ప్రయోజనాలను కాపాడటానికి కేంద్ర ప్రభుత్వం సమయానుకూలంగా చర్యలు, జోక్యం, అభివృద్ధి పనులు, వివిధ ప్రాజెక్టుల అమలుకు చాలా కృతజ్ఞుడను' అని గవర్నర్‌కు రాసిన లేఖలో సింగ్ పేర్కొన్నారు. సరిహద్దు చొరబాట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ వలసదారుల బహిష్కరణకు, మాదకద్రవ్యాలు, నార్కో ఉగ్రవాదంపై పోరాటానికి విధానాన్ని రూపొందించాలని ఆయన కేంద్రాన్ని అభ్యర్థించారు. బయోమెట్రిక్‌ను కఠినంగా కాలపరిమితితో, వేగవంతమైన సరిహద్దుతో అమలు చేస్తూ స్వేచ్ఛా ఉద్యమ పాలన కఠినమైన, ఫూల్‌ప్రూఫ్ సవరించిన యంత్రాంగాన్ని కొనసాగించాలని ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

**సొంత పార్టీ నుంచే విమర్శలు..**

జాతుల మధ్య వైరంతో దాదాపు రెండేళ్లుగా మణిపూర్ అట్టుడుకుతోంది. హింస కారణంగా ఇప్పటివరకు 250 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అంచనా. అయితే, అల్లర్లను అరికట్టడంలో బీరెన్ సింగ్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ విపక్షాలు సహా సొంత పార్టీ నేతల నుంచే విమర్శలు ఎదురవుతున్నాయి. ఇదే సమయంలో హింసను ప్రేరేపించడం వెనక ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ హస్తం ఉందనే ఆరోపణలు రావడం, వీటికి సంబంధించి ఆడియోలు ఇటీవల లీక్ అయ్యాయి. ఈ అంశాన్ని కుకీ సంబంధిత సంస్థ సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. వీటికి సంబంధించి ఫోరెన్సిక్ నివేదిక అందించాలని ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది.

## 'లడ్కీబహిన్' లబ్ధిదారుల్లో 5 లక్షల మంది అనర్హులు

**ముంబై:** మహారాష్ట్రలో అమలయ్యే ముఖ్యమంత్రి మాఝి లడ్కీ బహిన్ యోజన లబ్ధిదారుల సంఖ్య తగ్గింది. 2024 డిసెంబరులో ఉన్న 2.46 కోట్ల నుంచి 2.41 కోట్లకు పడిపోయింది. గతనెలలో ఐదు లక్షల మంది మహిళలను ఈ పథకానికి అనర్హులుగా గుర్తించారు. ఈ మేరకు మహిళా, శిశు సంక్షేమాధికారి ఆదివారం తెలిపారు. గతేడాది జులై నుంచి డిసెంబరు వరకు సంబంధిత మహిళల ఖాతాల్లో రూ.450 కోట్లు జమ అయినట్లు డబ్ల్యూసీడీ మంత్రి అదితీ తత్కారే తెలిపారు. అనర్హుల నుంచి డబ్బు తిరిగి తీసుకునే ఆలోచన లేదన్నారు. ఇకపై వారికి లబ్ధి చేకూరబోదని చెప్పారు. 'ఐదు లక్షల మందిని అనర్హులుగా గుర్తించాం. 1.5లక్షల మంది 65ఏళ్లకుపైబడిన వారున్నారు. 1.6లక్షల మందికి నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయి లేదా నమో శేట్కరి యోజన వంటి ప్రభుత్వ పథకాల నుంచి లబ్ధి పొందుతున్నారు. 2.3 లక్షల మంది సంయ్ గాంధీ నిరంధర్ స్కీము లబ్ధిదారులు. వీరంతా లడ్కీ బహిన్ యోజనకు అనర్హులు' అని ఓ అధికారి వెల్లడించారు. గతేడాది జులై ఈ పథకాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.

## దక్షిణాది ఏకమవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

మాతృభూమి' ఆధ్వర్యంలో ఆదివారం 'మాతృభూమి ఇంటర్‌నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్' సదస్సు జరిగింది. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్.. విజన్ 2050 దక్షిణాది రాష్ట్రాలు ఎందుకు కలిసి పని చేయాలనే' అంశంపైన సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే, దక్షిణాది రాష్ట్రాలు మెరుగైన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినందుకు దక్షిణాదిని కేంద్రం శిక్షిస్తున్నాదా? అని ప్రశ్నించారు.'తెలంగాణ రైజింగ్' అనేది ఒక నినాదం మాత్రమే కాదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల స్వప్నమన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు తాము పలు కార్యక్రమాలు చేపడుతున్నామని,దేశంలోని ముంబయి, ఢిల్లీ, బెంగళూర్, చెన్నై వంటి నగరాలతో కాకుండా ప్రపంచంలోని న్యూయార్క్, లండన్, సింగపూర్, టోక్యో, సియోల్ వంటి ముఖ్య నగరాలతో పోటీపడేలా హైదరాబాద్ ఉండాలని అనుకుంటున్నామన్నారు. 30 వేల ఎకరాలలో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని, ఇది భారతదేశంలోని పూర్తి హరిత, పరిశుభ్రమైన, అత్యుత్తమమైన నగరంగా ఉండబోతుందని, ప్రపంచంలోని ఇతర నగరాలతో పోల్చుకుంటే ఫ్యూచర్ సిటీ సరైన ప్రణాళిక, జోన్లు ఉన్న నగరంగా ఉండబోతుందని, అలాగే ఇదొక మొట్టమొదటి నెట్‌జీరో సిటీగా ఉండనుందని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. దక్షిణాది రాష్ట్రాల్లో తీర ప్రాంతం లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, అందుకే తాము డ్రై పోర్ట్ నిర్మించనున్నామని, దీనిని ఆంధ్రప్రదేశ్‌లోని సి పోర్ట్ (సముద్ర రేవు)కు ప్రత్యేక రైలు, రోడ్డు మార్గం ద్వారా అనుసంధానం చేస్తామన్నారు. తమ ప్రభుత్వం ఇటీవల ఎనర్జీ పాలసీని విడుదల చేసిందని, ఇవిలపై ఉన్న అన్ని పన్నులను తొలగించామని,ఇవిల అమ్మకాల్లో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం తొలి స్థానంలో ఉన్నదన్నారు. రాష్ట్రంలోని 3 వేల ఆర్‌టిసి బస్సులను దశలవారీగా ఇవిలుగా మార్చనున్నామన్నారు.

**బిఆర్ఎస్ పదేళ్ల కాలంలో రూ.25వేల కోట్ల పెట్టుబడులను సాధించలేదు**

బిఆర్ఎస్ తన పదేళ్ల కాలంలో రూ. 25వేల కోట్ల పెట్టుబడులను కూడా సాధించలేకపోయిందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పదేళ్ల బిఆర్ఎస్ కాలంలో తెలంగాణ రాష్ట్రం కోసం చేసింది ఏమీ లేదని, ఆ పార్టీ నాయకులు ఎన్నో వాగ్దానాలు చేశారే తప్ప, వాటిని నెరవేర్చలేదని ఆరోపించారు. ఈ ఏడాది దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో తమ ప్రభుత్వం రూ.1,82,000 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించామని వివరించారు.

**విద్యా, నైపుణ్యాలకు ప్రథమ ప్రాధాన్యాత:**

విద్యా, నైపుణ్యాలు తన ప్రథమ ప్రాధాన్యాతలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అన్ని గురుకులాల్లో మెస్,కాస్మోటిక్ ఛార్జీలను రెట్టింపు చేశామని, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామన్నారు. రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా, ఎకరాకు రూ.12 వేలు రైతు భరోసా, భూమి లేని కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేలను చెల్లిస్తున్నామని, పంటలకు కనీస మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్, మహిళలకు ఉచిత ఆర్‌టిసి బస్సుప్రయాణం, రూ.500లకు గ్యాస్‌సిలీండర్ తదితర సంక్షేమ పథకాలను సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. దేశంలోనే రైతులకు రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, ఇప్పటి వరకు 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణ మాఫీ చేసినట్టు తెలిపారు.

**'ఫిబ్రవరి 4న' తెలంగాణ సామాజిక దినోత్సవం**

సమగ్ర కుల సర్వే చేపట్టిన రాష్ట్రాలలో తొలి రాష్ట్రం తెలగాణ అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ నివేదికను అసెంబ్లీలోనూ ప్రవేశపెట్టామని, జనాభా దామాషా ప్రాతిపదికన తాము వనరులు సమకూర్చుతామన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ చేపట్టిందన్నారు. ప్రత్యేక శాసన సభ సమావేశాన్ని ఏర్పాటు చేసి, వర్గీకరణ అమలుకు తీర్మానం చేసిన నేపథ్యంలో ఇక నుంచి 'ఫిబ్రవరి 4వ తేదీ'ని 'తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవంగా నిర్వహిస్తామని సిఎం వెల్లడించారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీ విధానమన్నారు.

**హర్యానాలో కాంగ్రెస్‌ను దెబ్బతియడమే ఢిల్లీలో కేజ్రీ–వాల్‌కు ప్రతికూలమైంది...**

హర్యానాలో కేజ్రీవాల్ కాంగ్రెస్‌ను దెబ్బతీశారని, ఢిల్లీలో అది ఆయనకు ప్రతికూలమైందని, అంతిమంగా బిజెపి లాభపడిందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక, నియోజకవర్గాల పునర్విభనకు సంబంధించిన విషయంలో అందరూ ఏకమవ్వడానికి ఇదే సరైన సమయమన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల ఆధారంగానే కుటుంబ నియంత్రణను పాటించామని, కానీ జనాభా ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలకు అదనంగా నియోజకవర్గాలు రాకపోగా, ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలను కోల్పోయే పరిస్థితి ఉంటుందని సిఎం తెలిపారు.నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఆయా రాష్ట్రాల్లో ఉన్న సీట్లకు అదనంగా 50 శాతం సీట్లు పెంచాలని ప్రధాని మోదీని కోరినట్టు తెలిపారు. జనాభా దామాషా ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజనను చేపడితే బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలల్లో గెలిచే సీట్లతోనే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు ఉంటాయని, తద్వారా దక్షిణాది రాష్ట్రాలపై ఆధారపడాల్సిన పని లేదని సిఎం తెలిపారు. ఇది ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా దెబ్బతీస్తుందని సిఎం అన్నారు.

# ఆరోగ్య కేంద్రాల వైద్య సేవలు సద్వినియోగం

### సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

### విద్యార్థుల వసతి గృహాల్లో సదుపాయాలపై ఆరా



**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. ఆదివారం ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని షెడ్యుల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలుర వసతి గృహాన్ని, వ్యవసాయ మార్కెట్ యార్డు గోదామును, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే పేషంట్లకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు, సిబ్బందికి కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా క్షేత్ర స్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. ల్యాబ్ వార్డు తదితర వాటిని పరిశీలించి అందుబాటులో ఉన్న పరికరాలను ఉపయోగించుకుని వైద్య సేవలు అందించాలని అన్నారు. అనంతరం గ్రామంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలుర వసతి గృహాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వసతి గృహంలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు.?, వారికి ఏ విధమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. అన్ని మౌళిక సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా లేవా అనే విషయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. చివరగా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న తరగతి గదులు పూర్తి చేయడం లేదనే విషయాన్ని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, నిర్మాణం పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించాలని తహశీల్దార్, ఎంపిడివోలను కలెక్టర్ ఆదేశించారు.జిల్లా వైద్యాధికారి డా. రజిత, పిఆర్ ఈఈ సుదర్శన్ రెడ్డి, తహశీల్దార్ సురేష్, ఎంపిడివో బీరయ్య, మెడికల్ ఆఫీసర్ డా. గీతాంజలి, వార్డెన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మనస్తాపంతో వలస కూలీ ఆత్మహత్య



**ప్రజాపక్షం/గంగాధర:** మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజకుమార్ పటేల్ (25) గత కొద్ది కాలంగా గంగాధర మండలంలోని ఒద్యారం గ్రామ శివారులోని ఎస్‌విజి గ్రానైట్ క్వారీలో కూలీగా పనిచేస్తున్నాడు. గత వారం పది రోజుల నుంచి పని ఇష్టం లేక ఇంటికి వెళ్తానని తన తల్లిదండ్రులకు ఫోన్ చేయగా పనిలో ఉండాలని, ఇంటికి రావద్దని వారు తెలియజేయడంతో మనస్తాపం చెందాడు. దీంతో ఆదివారం ఉదయం 6 గంటలకు ఎవరూ లేని సమయంలో క్వారీ దగ్గరలోని వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని సోదరుడు కన్యలాల్ పటేల్ ఫిర్యాదు మేరకు దరఖాస్తు తీసుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు.

## ఆటలతో శక్తిసామర్థ్యాలు పెంపు



**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్ :** ఆటలు విద్యార్థుల శక్తిసామర్థ్యాలను పెంచుతాయని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. ఆదివారం పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి గ్రామంలోని పల్లవి పాఠశాలలో స్పోర్ట్స్ అకాడమీ కార్యక్రమాన్ని స్థానిక నాయకులతో,పాఠశాల యాజమాన్యంతో కలిసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలు శారీరకంగా ఎదిగినప్పుడే వారి ఆరోగ్యం బాగుంటుందని, చదువుల్లో రాణిస్తారని అన్నారు. పెద్ద పెల్లి లో స్పోర్ట్స్ అకాడమీ ప్రారంభించడం శుభ పరిణామమని పల్లవి మోడల్ స్కూల్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్,పల్లవి పాఠశాల యాజమాన్యం శోభారాణి ఎల్.రాజయ్య ,సుల్తానాబాద్ మార్కెట్ చైర్మన్ మినిపల ప్రకాష్ రావు పట్టణ కౌన్సిలర్ నుగిళ్ల మల్లన్న,పట్టణ అధ్యక్షులు సురేష్ గౌడ్, కౌన్సిలర్ సంపత్, బొడ్డు పల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల యాజమాన్యంపాల్గొన్నారు.

## ‘శ్రేష్ట కిడ్స్’ విద్యార్థుల ప్రతిభ




**ప్రజాపక్షం/మంథని:** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో రైసిల్ నాలెడ్జ్ ఎడ్యుకేషన్ సొల్యూషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అబకస్, వేదిక్ మ్యాథ్స్ కాంపిటీషన్‌లో మంథని పట్టణంలోని శ్రేష్ట కిడ్స్ విద్యార్థులు అత్యంత ప్రతిభకనబర్చారు. జిల్లా స్థాయి అబాకస్ పోటీలలో ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 400మంది విద్యార్థులకు పాల్గొన్నారు. పోటీల్లో శ్రేష్ట కిడ్స్‌లో ఐదో తరగతి చదువుతున్న ఎస్.శ్రీజని జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిని, ఒకటో తరగతి చదువుతున్న హిమాన్సీ తృతీయ బహుమతి సాధించినట్లు పాఠశాల కరెస్పాండెంట్ సిరిపురం బిందు తెలిపారు. జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కార్పోరేట్ స్కూళ్లకు ధీటుగా తమ పాఠశాల విద్యార్థులుబహుమతులు సాధించడం చాలా సంతోషంగా ఉందని ఆమె అన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను కరెస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్ వేల్పుల మౌనిక, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఆకట్టుకున్న చిన్నారుల నృత్యప్రదర్శన




**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రంలోని విజ్ఞాన్ ప్రి ప్రైమరీ స్కూల్ అన్యువల్ డే సెలబ్రేషన్స్ గ్రాండ్‌గా నిర్వహించారు. చిన్నారులు వివిధ నృత్య ప్రదర్శనలతో అలరించారు. అనంతరం వారికి పాఠశాల యాజమాన్యం మెమోంటోలు అందజేశారు. ముఖ్యఅతిథులుగా మండల ఎంఈవో కృష్ణహరి, ఫెరెంట్స్ కమిటీ తరుపున బండారి బాల్‌రెడ్డి హాజరైయ్యారు. పాఠశాల నిర్వహకులు ఎండీ నయిమా, ప్రిన్సిపాల్ శరత్, కరస్పాండెంట్ యం.డీ. లతీఫ్, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ సంతోష్, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/మంథని:** అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజా పంపిణీ బియ్యం పక్కదారి పడుతోంది. ఆదివారం మంథని నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా మండలంలోని నాగారంవద్ద రేషన్ బియ్యాన్ని మంథని పోలీసులు పట్టుకున్నారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటో ట్రాలీలో 20 ప్లాస్టిక్ సంచుల్లో ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న తొమ్మిది క్వింటాళ్ల బియ్యంను పట్టుకున్నారు. రేషన్‌బియ్యంపై ఆరా తీయగా బిట్టుపల్లికి చెందిన కాసు రాజు అనే వ్యక్తి మహారాష్ట్రలోని సిరొంచకు బియ్యం తరలిస్తున్నట్లు ఆటో ట్రాలీ డ్రైవర్ కుర్ర సమ్మయ్య పోలీసులకు తెలిపారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్న ఆటోను, బియ్యంను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరుగుతుందని ఎస్ఐ రమేష్ తెలిపారు.

## చిలుముల స్వప్న నియామకం

**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఆర్నకొండ గ్రామానికి చెందిన చిలుముల స్వప్న రెండవసారి తిరిగి ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన మహిళా కాంగ్రెస్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని తీసుకున్నారు. రాబోవు రోజుల్లో పార్టీ పటిష్టతకు కృషి చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి చెందిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా చిలుముల స్వప్న తన నియామకానికి సహకరించిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డిలకు ధన్యవాదాలు తెలియజేశారు.



# బిసిలకు 42శాతం సీట్లు ఇచ్చేందుకు సిద్ధం

### జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** 1931 తర్వాత, సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ కుల సర్వే 2024 అన్నింటికీ ఉపయోగం అని, ఎస్సీల ఎబిసిడిల వర్గీకరణ, బీసీలకు 42శాతం సీట్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చి న మాట ప్రకారం అన్ని హామీలను నెరవేరుస్తోందని జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చెట్కూరి కమలాకర్ యాదవ్‌లు అన్నారు. కుల గణన, ఎస్సీ ఎబిసిడీల వర్గీకరణను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం సిద్దిపేట జిల్లా ధూల్మిట్ట మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆద్వర్యంలో చెట్కూరి కమలాకర్ యాదవ్ అధ్యక్షతన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ గౌడ్ పాటుగా జనగామ జిల్లా డిసిసి అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిలకు పాలాభిషేకం నిర్వహించారు. చెట్కూరి కమలాకర్ యాదవ్ మాట్లాడుతూ... తొమ్మిదేళ్ల పాలనలో కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమకారులను, పేద ప్రజలను పట్టించుకున్న పాపన పోలేదని, రాష్ట్రంను దోచుకుని లక్షల కోట్ల అప్పులు, ప్రజా సమస్యలే మిగిల్చారని, ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కారం చూపుతోందని, ప్రజా పాలన ద్వార తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ పథకాలు నేడు ప్రజాదరణ పొందుతున్నాయని అన్నారు. మాటలు కాదు చేతల ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అనిఅన్నారు. బీసీలకు 42శాతం సీట్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ తీర్మానం చేసిందని, అలాగే చట్ట సభల్లో ప్రవేశపెట్టి అధికారికంగా ప్రభుత్వం అమలు చేయాలని యూత్ కాంగ్రెస్ తరుపున కోరుతున్నట్లు కమలాకర్ యాదవ్ తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లోను కాగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రజలు ఆశీర్వదించాలని, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రాకేశ్, జనగామ జిల్లా యూవజన కాంగ్రెస్ అధ్యక్షులు గద్మ సంతోష్ రెడ్డి, ధూల్మిట్ట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సమన్, చేర్యాల మండల అధ్యక్షులు బాల్‌రాజ్, జనగామ మండల అధ్యక్షులు ప్రకాశ్ యాదవ్ వివిధ మండలాల గ్రామాల యూత్ అధ్యక్షులు, ధూల్మిట్ట గ్రామ శాఖ కాగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెప్యాల అనిల్ గౌడ్, పార్టీ మండల నాయకులు చెన్నోజు రాజు, యూత్ నాయకులు బాబు, గెంటే కరుణాకర్ యాదవ్ పాల్గొన్నారు.

# గురుకులహాస్టల్ నిర్వహణ తీరుపై గుస్సా



### జగిత్యాలజిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి

**ప్రజాపక్షం /జగిత్యాలరూరల్ :** జగిత్యాల పట్టణములోని జ్యోతిబా పూలే గురుకుల కళాశాలను ఆదివారంజగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. గురుకుల హాస్టల్, తరగతి గదులు, నివాస గదులు, మరుగు దొడ్లు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం సహపంక్తి భోజనం చేశారు. కొత్త కామన్ డైట్ ప్రకారం భోజన వసతి కల్పించడం పై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సంబంధిత గురుకుల పాఠశాల ఇన్చార్జి అధికారికి హాస్టల్ నిర్వహణపై అసహనం వ్యక్తం చేస్తు, ఇన్‌చార్జి అధికారికి హాస్టల్ నిర్వహణపై పలు సూచనలు చేశారు. సంబంధిత జిల్లా అధికారికి హాస్టల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గౌతమ్ రెడ్డి ఆదేశించారు.

# వేధింపులు తాళలేక.. రోడ్డుపై బైఠాయింపు

### పెద్దపల్లి జిల్లా మంథనిలో ఘటన




**ప్రజాపక్షం/మంథని:** కన్నతండ్రిలా చూసుకోవాల్సిన మామ...కష్టం తెలియకుండా కాపాడుకోవాల్సిన భర్త వేధింపులు భరించలేక ఏడు నెలల గర్భిణి తనకు న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించిన ఘటన పెద్దపల్లి జిల్లా మంథనిలో చోటు చేసుకుంది. మంథని మున్సిపల్ పరిధిలోని పోచమ్మవాడకు చెందిన రావుల మౌనిక అనే గర్భిణీ తన కుమారుడు, తల్లితో కలిసి అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేసింది. వివరాల్లోకి వెళ్తే... మంథని పట్టణంలోని పోచమ్మవాడకు చెందిన రావుల మారుతి ప్రసాద్ అనే యువకుడితో ఖమ్మం జిల్లాకు చెందిన మౌనికతో నాలుగేండ్ల క్రితం వివాహం జరిగింది. కొద్ది రోజులుగా తన మామ, భర్త వేధింపులు ఎక్కువయ్యాయని, ఈ క్రమంలో గత నెలలో తన భర్త, మామ ఇద్దరు కలిసి ఇంటి నుంచి గెంటివేశారని, ఈ విషయంపై మంథని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి తన తల్లి దండ్రుల వద్దకు వెళ్లినట్లు ఆమె తెలిపింది. అయితే నెల రోజులు గడుస్తున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, తనకు న్యాయం జరగడం లేదని ఆమె వాపోయింది. తన మామ సైతం లైంగికంగా వేధింపులకు గురి చేస్తుండగా, తమ భర్త వరకట్నం కోసం వేదిస్తున్నాడని ఆమె మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేసింది. తనకు ఒక బాబు ఉన్నాడని, ప్రస్తుతం ఏడు నెలల గర్భవతినని,న్యాయం చేయాలని వేడుకుంటుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

# విద్యా రంగానికి 20శాతం నిధులివ్వండి

### టిఎస్‌ఇసి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఎన్.తిరుపతి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ విద్యా పరిక్ష కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఎన్.తిరుపతి డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత ప్రభుత్వం పదేళ్ల తమ పాలన కాలంలో అరకొర నిధులను కేటాయించి పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం 2025–26 బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించి ఆ నిధులను పూర్తిగా ప్రభుత్వ విద్యా రంగానికే వినియోగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.రఘుశంకర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఇతర రాష్ట్రాలు విద్యకు 14.7శాతంనిధులుకేటాయిస్తుండగా అందులో సగానికన్నా తక్కువగా కేవలం 7.3 శాతం మాత్రమేప్రభుత్వం విద్యకు కేటాయించిందన్నవిషయాన్నిగుర్తు చేశారు. కేటాయింపులు తక్కువగా ఉండడం వల్లే విద్య నాణ్యతలో తెలంగాణ 35వ స్థానానికి దిగజారిందన్నారు. టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉద్యమిస్తేనే విద్యారంగాన్ని పరిరక్షించుకోగలుగుతామన్నారు. తెలంగాణ విద్యాపరిరక్షణ రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.రాజిరెడ్డి, టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.తిరుపతి, డిటిఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎం.రఘుశంకర్ రెడ్డి, డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజిరెడ్డి, డిటిఎఫ్ రాష్ట్ర అడిట్ కమిటీ కన్వీనర్ పి.ఈశ్వర్ రెడ్డి, డిటిఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కె.నారాయణరెడ్డి, పూర్వ కార్యదర్శి కె.చంద్రమౌళి, వివిధ ఉపాధ్యాయ సంఘ బాద్యులు ఏసురెడ్డి, జానకీదేవి, ఆవాల నరహరి, జంకె రాంచంద్రారెడ్డి, తూముల తిరుపతి, వేల్పుల బాలయ్య, రాజమౌళి, అంజయ్య, శ్రీనివాస్, టి.తిరుపతి, బి.రమేష్, చంద్రశేఖర్, కోల రాజమల్లు తదితరులున్నారు.

# ద్విచక్ర వాహనాల దొంగల ముఠా అరెస్టు



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** గత కొన్ని నెలలుగా జగిత్యాల, కలమడుగు, జన్నారం మండలం మంచిర్యాల జిల్లాలో ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్న దొంగల ముఠాను ఆదివారం తెల్లవారు జామున జగిత్యాల మండలం తిప్పన్నపేటశివారులో అదుపులోకి తీసుకున్నారు. జగిత్యాల డిఎస్‌పి రఘు చందర్ తెలిపిన వివరాల ప్రకారం గత జనవరిలో జగిత్యాల రూరల్ మండలం తిప్పన్నపేటలో తన ఇంటి ముందు పార్కు చేసిన టూ వీలర్ బైక్ ని ఎవరో గుర్తు తెలియని దొంగలు దొంగిలించారని ఫిర్యాదిదారుడు భారతపు పెద్ది రాజం ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ ఎస్ఐ సదాకర్ కేసు నమోదు చేసుకొని, జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రెండు స్పెషల్ టీంలు ఏర్పాటు చేశారు. రూరల్ ఎస్సై సుధాకర్ టీం ఆదివారం తెల్లవారుజామున తిప్పన్నపేట శివారులో కారులో వస్తున్న ఐదుగురు వ్యక్తులను అనుమానితులుగా గుర్తించి విచారించారు. జక్కుల గోపాల్, సింగం రాజు, నేరెళ్ల నరేష్, సంపతి కుమారస్వామి, బుర్ర రాజేందర్ ఒక ముఠాగా ఏర్పడ్డారు. రాత్రి వేళల్లో కలమడుగు నుంచి కారులో బయలుదేరి వివిధ గ్రామాలలో ఇంటి ముందు పార్కు చేసిన బైకులను దొంగలిస్తున్నామని, దాచి పెట్టామని తెలిపారు. అలాగే సారంగాపూర్ మండలం పెంబట్లలో డిసెంబర్ నెలలో ఒక బైక్ దొంగిలించామని, అంతకు ముందు దండేపల్లి, వెలగనూర్‌లో ఒక బైక్, జనవరిలో చిన్న బెల్లాల్‌లో ఒక బైక్, తిప్పన్నపేటలో ఒక బైక్, దండేపల్లిలోని ద్వారకలో బై క్‌లను దొంగతనం చేశామని ఒ ప్పుకున్నారు. నిందుతుల నుండి రికవరీ చేసిన 5 బైకులు, ఒక కార్, ఐదు మొబైల్ ఫోనులు స్వాధీనం చేసుకున్నారు. మేజిస్ట్రేట్ వద్దకు పంపుతున్నామని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. ఇదిలా ఉండగా ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్న దొంగల ముఠా నిందితులను చాకచక్యంగా పట్టుకొని ద్విచక్ర వాహనాలను రికవరీ చేసిన జగిత్యాల రూరల్ సీఐ కృష్ణా రెడ్డి, ఎస్సై సుధాకర్, కానిస్టేబుల్ శ్రీనివాస్, గంగాధర్, రాహుల్, ఉమర్, మోహన్ లను జగిత్యాల ఎస్పి అశోక్‌కుమార్, డీఎస్పీ రఘు చందర్ అభినందించారు.

# ‘నేడు’ కాంగ్రెస్ ఎంఎల్‌సి అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి నామినేషన్

### హాజరుకానున్న నాలుగు జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి. నరేందర్‌రెడ్డి సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఎస్సారార్ కాలేజీ గ్రౌండ్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీతో నామినేషన్ సమర్పించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి నాలుగు జిల్లాల ఇంచార్జి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావుతో పాటు జిల్లాల మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గ్రంథాల సంస్థల అధ్యక్షులు, మాజీ జడ్పిటిసిలు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. పట్టభద్రుల నియోజకవర్గంలోని నాలుగు జిల్లాలో నుంచి పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, ముఖ్య నేతలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ముస్లింలకు రిజర్వేషన్లు వద్దనడానికి ‘బండి’ ఎవరు?

### కాంగ్రెస్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఎండి తాజ్




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** హిందూ ముస్లింలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే చరిత్ర కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్‌దేనని జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎం.తాజ్ దుయ్యబట్టారు. ముస్లింలకు రిజర్వేషన్లు వద్దు అని చెప్పడానికి ఆయన ఎవరు? అని ప్రశ్నించారు. కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిసిలకు ప్రభుత్వాలు రిజర్వేషన్లు పెంచితే ముస్లింలు ఎప్పుడైనా అడ్డుకున్నారా? అంటూ ప్రశ్నించారు. అర్బన్ బ్యాంకు డైరెక్టర్ నుంచి కేంద్ర మంత్రిగా ఎదిగినా బండి సంజయ్ బుద్ధి, ప్రవర్తన మారలేదన్నారు. కుంభమేళాలో చాలా మంది హిందూ భక్తులు తొక్కిసలాటలో చనిపోయి, గాయపడిన వారిని ముస్లింలు మసీదులకు తీసుకుపోయి అన్ని విధాలుగా ఆదుకుని సౌకర్యాలు కల్పించారని గుర్తు చేశారు. అభివృద్ధిపై మాట్లాడకుండా మసీదులు తవ్వుతాం, ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించవద్దు అని మాట్లాడడం తగదన్నారు. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. దేశంలో 30 శాతం ముస్లింలు ఉన్నారని, అందులో 90 శాతం పేదలే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లింలకు ఎందుకు రిజర్వేషన్లు కల్పించకూడదో ఆలోచించాలన్నారు. ముస్లింలకు 8 నుంచి 10 శాతం వరకు రిజర్వేషన్ కచ్చితంగా కావాలని కోరారు. హిందూ ముస్లింల మధ్య చిచ్చు పెట్టి ఇప్పుడిప్పుడే కొన్ని రాష్ట్రాల్లో గెలుస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు షహెన్నా, కలియుముద్దీన్ షహెన్నా, అబ్దుల్ బారీ, సిరాజ్, బషీర్, షబానా మహమ్మద్, అనీఫ్, ఇమ్రాన్, నుస్రత్, ఫిరోజ్, షాకీర్, సయ్యద్ అన్సర్, సయ్యద్ ఖలీల్, మహమ్మద్ కాజా, అక్రమ్, జమీల్, జమాల్ ఖాన్, ముజాహిద్, ఖజా ఖాన్, ఆరిఫ్ ఖాన్, లాయిక్ ఖాద్రి తదితరులున్నారు.

# పట్టభద్రులకు, ప్రభుత్వానికి వారధిగా నరేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి/హుజురాబాద్ :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వూట్కూరి నరేందర్ రెడ్డి భారీ మెజార్టీతో మం డలికి వెళ్లడం ఖాయమని హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇం చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. ఆదివారం హుజురాబాద్‌లోని సిటీసెంట్రల్ కన్వెన్షన్ హాలులోఆత్మీయ సమ్మేళనం సభలో ఆయన ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డితో పాటుహాజరయ్యారు. ప్రణవ్ మాట్లాడుతూ హుజు రాబాద్ నియోజకవర్గవ్యాప్తంగా 13వేల పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్, కాం గ్రెస్ అనుబంధ సంఘాలు పనిచేసి హుజురాబాద్ నుంచి అత్యధిక మెజార్టీ ఇవ్వాలని కోరారు. కాం గ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలోనే 55,000 మందికి నియామక పత్రాలిచ్చిందన్నారు. 54 విద్యాసంస్థలను నెలకొల్పడం ద్వారా విద్యారంగం పట్ల నరేందర్‌రెడ్డికి ఉన్న శ్రద్ధ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిమాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆద్వర్యంలో ప్రభుత్వం అద్భుతంగా అభివృద్ధి చెందుతుందని, ఒక ఏడాది కాలంలోనే 55వేలఉద్యోగాలుఇచ్చి యువతకు భరోసా కల్పించారన్నారు. మహిళా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలుసత్యప్రసన్నరెడ్డి,హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరి రాజేశ్వరి స్వామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సుగుణాకర్‌రెడ్డి, ఆంజనేయ స్వామి దేవస్థాన చైర్మన్ కొలిపాక శంకర్, హుజురాబాద్ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, హుజురాబాద్ పట్టణ, మండల మహిళా అధ్యక్షురాలు పుష్పలత, రాధ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్, సోష ల్ మీడియా ఇంచార్జి రాజు, సొల్లు బాబు, లావణ్య, లక్ష్మారెడ్డి,బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు గోస్కుల శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి సభ్యుడు దండ శోభ విక్రమ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాజేంద్ర ప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, మైనారిటీ నాయకులు ఉస్మాన్ పాషా, వివిధ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

# పోడు సాగుదారులకు పట్టాలు




సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు విశ్వనాథం డిమాండ్

ఏజెన్సీ గ్రామాల అభివృద్ధి కూనంనేని లక్ష్యం

**ప్రజాపక్షం/పాల్వంచ :** పోడు సాగు చేసుకుంటున్న సాగుదారులందరికీ పట్టాలు ఇచ్చి రైతు భరోసా అందించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధి ఉల్వనూరు ఎస్సీకాలనీ, చంద్రాలగూడెంలలో ఆదివారం జరిగిన సిపిఐ గ్రామ శాఖ మహాసభలు విజయవంతమయ్యాయి. ఉల్వనూరు ఎస్సీ కాలనీలో నిట్టా అమృతరావు అధ్యక్షతన, చంద్రాలగూడెంలో వజ్జా ఆదినారయణ అధ్యక్షతన జరిగిన గ్రామ శాఖ మహాసభలకు ముఖ్యఅతిధులుగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, పాల్వంచ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నాయకులు నిమ్మల రాంబాబు, కొంగర అప్పారావు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ పేద ప్రజలు, కష్టజీవులు, కార్మికుల పార్టీ సిపిఐ అన్నారు. అనాదిగా పోడు సాగు చేసుకుంటున్న పోడు సాగుదారులందరికీ పట్టాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందెందుకు సిపిఐ కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఏజెన్సీ గ్రామాలను అభివృద్ధి చేయడమే ఎమ్మెల్యే కూనంనేని లక్ష్యమన్నారు. మండలంలోని ప్రతి గ్రామ పంచాయితీలో సిపిఐ ప్రాతినిత్యం ఉండేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీచేయడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.అనంతరం గ్రామ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉల్వనూరు ఎస్సీ కాలనీ గ్రామశాఖ కార్యదర్శిగా నిట్టా అమృతరావు, సహాయ కార్యదర్శిగా బేతం మురళీ, చంద్రాలగూడెం గ్రామ శాఖ కార్యదర్శిగా కొర్సా పట్టాభి, సహాయ కార్యదర్శిగా ఈసం చిన్న శేషయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశాల్లో సిపిఐ నాయకులు వేములపల్లి శ్రీనివాసరావు, దారా శ్రీనివాసరావు, కుంజ రాందాస్, వజ్జా నారాయణ, ఈసం గోపయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక విద్యతో మెరుగైన ఉపాధి

మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారాములు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసిస్తే మెరుగైన ఉపాధి మార్గాల సాధన సులువవుతుందని, తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం వసుంధర ఒకేషనల్ జూనియర్ కాలేజీ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు స్వయం ఉపాధి రంగాల వైపు పయనించాలన్నారు. ప్రభుత్వం యువత ఉపాధి కోసం అనేక రంగాలలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాన్ని కల్పించే వృత్తి విద్యా కోర్సులను గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన యాజమాన్యం సేవలను ప్రశంసించారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో విద్యార్థులు లక్ష్యంను చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ఆటా, పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కె.రాజశేఖర్‌గౌడ్, కాలేజీ యాజమాన్యం కుమార్, ఆనంద్ కుమార్, కన్యాకుమారి, విజయ కుమారి, ఇంచార్జీ ప్రిన్సిపాల్ దుర్గ, సిబ్బంది సుగుణ, నవ్య, శ్రీలత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## మంగాయమ్మకు కూనంనేని నివాళి



**ప్రజాపక్షం/జూలూరుపాడు :** జూలూరుపాడు మండల పరిధిలోని వెంగన్నపాలెంలో పోలీస్ అసిస్టెంట్ కమిషనర్ (ఎసిపి), సబ్బతి విష్ణుమూర్తి, సీనియర్ పాత్రికేయులు సబ్బతి శివమూర్తి మాతృమూర్తి సబ్బతి మంగాయమ్మ దశదినకర్మ ఆదివారం జరిగింది. కార్యక్రమంలో సిపిఐ కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. మంగాయమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. సిపిఐ నాయకులు యల్లంకి మధు, సిరిపురపు వెంకటేశ్వర్లు, ఎఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు పాల్గొన్నారు.

## లక్ష్మయ్య మృతికి సిపిఐ సంతాపం



**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం గ్రామానికి చెందిన కొత్తపల్లి లక్ష్మయ్య ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య, పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డిపుల్లారెడ్డి, ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు తోట రమేష్, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు తదితరులు లక్ష్మయ్య పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్ష్మయ్య సింగరేణి కార్మికుడిగా పనిచేసే రిటైర్ అయ్యారని, ఎఐటియుసిలో పనిచేశారు. లక్ష్మయ్య ఎఐటియుసి మండల కోశాధికారి కొత్తపల్లి సీతారాములు పెద్ద సోదరుడు.

## రోడ్డు పనులు అడ్డుకున్న రైతులు



**ప్రజాపక్షం/చింతకాని :** సీతంపేట నుండి తిమ్మినేనిపాలెం బిటి రోడ్డు నిర్మాణ పనుల్లో జెసిడి తగిలి విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. ఈ విషయమై రైతులు సంబంధిత కాంట్రాక్టర్, విద్యుత్ అధికారులకు సమాచారమిచ్చారు. కాంట్రాక్టర్, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రైతులు రోడ్డు పనులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీతంపేట గ్రామానికి చెందిన రైతులు మాట్లాడుతూ 4 ట్రాన్స్ ఫార్మర్ల జంపర్లు, ఫ్యూజులు పోయాయని ఒక ట్రాన్స్‌ఫార్మర్ పెద్ద మంటలతో దగ్ధమైందన్నారు. అధికారులకు సమాచారమిచ్చినా పట్టించుకోవడంలేదన్నారు. మొక్కజొన్న పొట్టదశలో ఉందని నీరు లేక ఎండిపోయే పరిస్థితి ఉందని తక్షణమే విద్యుత్ తీగలు సరిచేసి కరెంటు పునరుద్ధరించాలని వారు కోరారు.

## అవి చిరుత పులి అడుగులు కావు..

అటవీ అధికారుల వెల్లడి



**ప్రజాపక్షం/పెనుబల్లి :** మండల కేంద్రంలోని రాథోని చెరువు వద్ద పాద ముద్రలు కనిపించడంతో స్థానిక ప్రజల్లో పులి అడుగులుగా అనుమానించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఆదివారం అటవీ శాఖ అధికారులు డిఆర్‌ఒ సురేష్ కుమార్, సెక్షన్ ఆఫీసర్ కాలు, బీట్ అధికారులు అరుణ కుమారి, ప్రసాద్‌లు పరిశీలించి అవి చిరుత పాదముద్రలు కాదని నిర్దారించారు. నక్కలు వాటి పిల్లలు పాద ముద్రలుగా నిర్థారించారు. చిరుత పాద ముద్రలు నక్క పాద ముద్రలని తెలపడంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయినా పెనుబల్లి మండలంలోని పులిగుండాల అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచార ఆనవాళ్లు ఉన్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని రైతులను, కూలీలను, స్థానిక ప్రజలను అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. అనుమానాలు ఉంటే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## నిత్యావసర వస్తువులు అందజేత



**ప్రజాపక్షం/చింతకాని :** ఆకలి అందరిది వాట్సాప్ గ్రూపు ద్వారా నాగులవంచ గ్రామానికి చెందిన వృద్ధురాలు ధర్మపురి సక్కుబాయికు నిత్యావసర సరుకులు ఆదివారం గ్రూప్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రూప్ సభ్యులు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల నుంచి ప్రతినెలా నిరుపేద కుటుంబాలకి, దిక్కుమొక్కు లేని అభాగ్యులకు గ్రూప్ సభ్యులందరి తరుపున నిత్యావసర సరుకులు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సభ్యులు వంకాయలపాటి వెంకట లచ్చయ్య, మునుకుంట్ల సుబ్బారావు, మదన్, కొండా గోపి, బాహాటం ఫణిరాజు, బుజ్జిబాబు పాల్గొన్నారు.

## నీరజ హాస్పిటల్ ఉచిత వైద్యశిబిరం



**ప్రజాపక్షం/అశ్వాపురం :** నీరజ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ భద్రాచలం ఆధ్వర్యంలో అశ్వాపురం మండలంలోని గొందిగూడెంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నీరజా మల్టీ స్పెషాలిటీ డాక్టర్ వైద్యులు నీరజ పంచాయితీ పరిధిలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలను ఆరోగ్య సమస్యలు తెలుసుకొని చికిత్స అందించారు. చిన్న పిల్లల వైద్య నిపుణులు శ్రీకాంత్‌రెడ్డి చిన్న పిల్లలకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకుని చికిత్స నిర్వహించి మందులు అందించారు. శిబిరంలో పాల్గొన్న రోగులకు ఉచితంగా బిపి, షుగర్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సర్వేశ్వరరావు, ఆర్ఎంపి డాక్టర్లు నరసింహారావు, నాగరాజు, ఆదిత్య, మిథున్, మురళి, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కోసం వినతి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇప్పించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో నేలకొండపల్లి, కూసుమంచి జర్నలిస్టులు దయాకర్ రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. జర్నలిస్టులకు స్థానికంగా స్థలాలు అందించాలని కోరారు. ఈ విషయం మంత్రి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని దయాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పోలంపల్లి నాగేశ్వరరావు, దేగల వెంకటేశ్వర్లు, ఎస్.నరసింహారావు, మందుల నాగరాజు, వనం అచ్యుర్రావు, గంజికుంట్ల వెంకన్న, గొలుసు ఆంజనేయులు, మాతంగి భార్గవ్, కొలికపొంగు సతీష్, లక్ష్మణ్, తిప్పర్తి సైదులు, రామచంద్రారావు, కోటయ్య పాల్గొన్నారు.

## కార్పొరేట్ స్థాయి వైద్యసేవలందించటమే లక్ష్యం

జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి

డాక్టర్ రాజశేఖర్‌గౌడ్



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జిల్లాలో కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలలో కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డిసిహెచ్ఎ) డాక్టర్ కె.రాజశేఖర్ గౌడ్ పేర్కొన్నారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. వార్డులలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యసేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.రాజశేఖర్‌గౌడ్ మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్ప త్రులలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులలో మందుల కొరత లేదన్నారు. హాస్పిటల్‌కు వచ్చే మందులను ఈ ఔషద్ పోర్టల్ లో నమోదు చేయిస్తున్నట్టు తెలిపారు. మందులు ఉన్నాయా.. లేవా అనే విషయం పోర్టల్‌లో చూస్తే తెలిసిపోతుందన్నారు. ప్రభుత్వ దవాఖానాలకు రోగుల సంఖ్య పెరిగేలా వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్పోరేట్ కంటే మెరుగైన వైద్య సేవలు అందుతున్నట్లు తెలిపారు. ప్రతీ హాస్పిటల్ లో పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నేలకొండపల్లి సీహెచ్సీకి ప్రహరీ గోడ, ఆర్‌ఓ ప్లాంట్‌ను మంత్రి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురామిరెడ్డిని కోరగానే స్పందించి నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. ఆయన వెంట వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయసాధనకు కృషి



ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాపక్షం/అశ్వాపురం :** సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయాల సాధనకు కృషిచేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అశ్వాపురం, మణుగూరు సేవా లాల్ సేన కమిటీ తరుపున బంజారా కుల దైవమైన ఈనెల 15న జరిగే సేవాలాల్ జయంతి వేడుకలను అశ్వాపురం మండల కేంద్రంలో అధికారికంగా నిర్వహించాలని కోరుతూ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కోరారు. ఈ మేరకు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో మణుగూరు సేవాలాల్ సేన అధ్యక్షుడు గుగులోత్ రవి నాయక్, ప్రధాన కార్యదర్శి భూక్యా నాగేశ్వరరావు, ఇస్లావత్ శ్రీనునాయక్, జరుపుల జగన్‌నాయక్, మణుగూరు మహిళ సేవాలాల్ సేన, అశ్వాపురం మండల అధ్యక్షులు గుగులోత్ మోహన్ నాయక్, ప్రధానకార్యదర్శి హుస్సేన్ నాయక్, సేవాలాల్ సేన కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం మండలం మొండికుంట గ్రామానికి చెందిన కోసూరి రాములు ఆదివారం మృతి చెందారు.ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రాములు స్వగృహానికి వెళ్లి పార్థివదేహానికి నివాళులర్పించారు.

**ఆళ్లపల్లి :** మండల పరిధిలోని రాఘవాపురం గ్రామానికి చెందిన గొగ్గెల శ్రీను తండ్రి గొగ్గెల రామయ్య అనారోగ్యంతో మృతిచెందారు. ఆదివారం వారి స్వగృహానికి ఎమ్మెల్యే వెళ్లి రామయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల పరిధిలోని సుద్దరేవు గ్రామంలో మణుగూరు అగ్రికల్చర్ ఎఇఒ కొమరం లక్ష్మణ్‌రావు మాతృమూర్తి దశదిన కర్మలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. పాయం రామ నరసయ్య, పడిగ సమ్మయ్య, ఎస్‌కే ఖదీర్, వాసం శ్రీకాంత్, భరత్, పాయం సత్యనారాయణ, భరత్, పర్వీన, సునీత, కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

## విద్యాభివృద్ధికి కాకతీయ విద్యా ట్రస్ట్ చేయూత

**ప్రజాపక్షం/మణుగూరు :** కాకతీయ విద్యా ఫౌండేషన్ నాయకులు గూడూరు సత్యనారాయణ ఆదివారం మణుగూరు విచ్చేసిన సందర్భంగా కమ్మ సంఘం నాయకులు స్వాగతం పలికారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయ విద్యా ట్రస్ట్ ద్వారా కమ్మ పేద విద్యార్థులకు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో ఉచిత విద్య, హాస్టల్ వసతులు కల్పిస్తున్నామన్నారు. అలాగే కమ్యూనిటీ కిచెన్ ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన పేద విద్యార్థులకు కాకతీయ విద్యా ఫౌండేషన్ విద్యా ట్రస్టు ద్వారా ఉచిత విద్య, హాస్టల్ వసతులు కల్పిస్తున్నామన్నారు. మండల పరిధిలో పేద విద్యార్థులు ఉంటే వారికి 6,7,8వ తరగతులలో ప్రవేశ అవకాశం ఉన్నదన్నారు. కార్యక్రమంలో మణుగూరు కమ్మ సంఘ గౌరవ అధ్యక్షులు దండా రాధ కృష్ణ, వీరపనేని చెన్నకేశవులు, అధ్యక్షులు ఉప్పలపాటి వెంకట రాం బాబు, పుచ్చకాయల శంకర్, తోటకూరి సతీష్ కుమార్, ఈరెల్లి అచ్చయ్య చౌదరి, ఉడతానేని రవి, ధారపనేని హరికృష్ణ, ముప్పారపు నరసింహారావు, ఉడతానేని శ్రీను, మల్లంపాటి వెంకటేశ్వర్లు, పూసులూరి శ్రీను పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండలం చిన్న కోరుకొండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1959–65 విద్యా సంవత్సరంలో చదివిన విద్యార్థిని విద్యార్థులు 100 మంది ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు ఉద్యోగాలలో, వ్యాపారాలలో పదవులలో ఉండి నేడు కొన్ని సంవత్సరాలకు కలుసుకోవడం పట్ల గతంలో విద్యార్థులుగా ఉండిన అనుభవాలను తీపి జ్ఞాపకాలను గత స్మృతులను గుర్తుంచుకొని ఉత్సాహంగా ఉల్లాసంగా జరుపుకున్నారు. అనంతరం వారి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిన్నాల వెంకటేశ్వర్లు, ఖమ్మంపాటి రామారావు, పసుమర్తి పుల్లారావు, వడ్లమూడి కృష్ణమూర్తి, కట్ట అజయ్ కుమార్, చావా వెంకటేశ్వరరావులు పాల్గొని పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని, ఉత్తమ ఫలితాలు, ప్రతిభను కనబరిచిన వారికి ప్రోత్సాహకాలను అందిస్తామని తెలిపారు.



## ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**ప్రజాపక్షం/ములకలపల్లి:**కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చి 14 మాసాలైనా ఎన్నికల ప్రణాళికలో ఆరు గ్యారెంటీల 420 హామీలను అమలు చేయడంలో పూర్తి విఫలమైందని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే సీతారామయ్య, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి ఎస్‌కే ఉమ్మర్ విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఫిబవరి 20న ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఆదివారం గుట్టగూడెంలో సవాళ్ల ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు భరోసా, మహిళలకు మహాలక్ష్మీ పథకం, వృద్ధాప్య పింఛన్, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఇల్లులేని వారికి ఇందిరమ్మ ఇల్లు లాంటి అనేక హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ హామీల అమలు కొరకు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 20న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మడిమి చంద్రన్న, వంక సురేష్, ముదిగొండ మల్లయ్య, దుబ్బ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# పట్టించుకుంటే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

ఆక్రమణకు గురవుతున్న రాజా బావి

బావి చుట్టూ దట్టంగా పెరిగిన చెట్లు..

గుప్త నిధుల కోసం గదుల్లో తవ్వకాలు..

నేటికీ చెక్కుచెదరని రాతి గదుల కట్టడాలు..




**ప్రజాపక్షం/జూలూరుపాడు :** మండల పరిధిలోని జూలూరుపాడు గ్రామపంచాయతీలోని కప్పల కుంట చెరువు సమీపంలో కాకతీయుల కాలం నాడు తాగు నీటి సౌకర్యంతో పాటు, వారు తలదాచుకునేందుకు నాటి కాకతీయ రాజులు నిర్మించిన రాజా బావి పూర్తిగా రాతి కట్టడంతో నిర్మించిన బావిని నాటి ప్రభుత్వాలు అధికారులు పట్టించుకోకపోవడంతో మరుగున పడింది. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని నాటి రోజుల్లోనే రాజులు అత్యంత మేదాసంపత్తిని కూడగట్టుకొని శత్రు సైన్యం ఎత్తుగడలను చిత్తు చేసేందుకు భావిలోనే సువిశాలమైన రాతితో గదులను నిర్మించుకొని నివాసం ఉన్నారు. అంతటి ప్రసిద్ధి చెందిన బావి ఆలనా పాలనను ఎవరూ పట్టించుకోకపోవడంతో రాజా బావి చుట్టూ దట్టమైన చెట్లు పెరిగి అడవిని తలపిస్తుంది. నేటికీ మండు వేసవిలో సైతం బావిలో నీళ్లు ఎండిపోయిన దాఖలాలు లేవని గ్రామస్తులు పేర్కొంటున్నారు. నీటి ఎద్దడి ఏర్పడ్డప్పుడు గతంలో వరి పొలాలు, కూరగాయల సాగు చేస్తున్న సమీకు పొలాల్లోని రైతులు భావిపై మోటర్లు పెట్టి నీటిని తోడినా భావి అడగంటేది కాదని కురువృద్ధులు పేర్కొంటున్నారు. నాటి రాజులు బావిలో బంగారు ఆభరణాలు దాచి పెట్టి ఉంటారనే పూకార్లు నేపద్యంలో బావి చుట్టూ పదుల సంఖ్యలో ఆయిల్ ఇంజన్లు పెట్టి గతంలో నీటిని తోడినా నీళ్ల మట్టం ఇంచుకూడా తగ్గలేదని గ్రామస్తులు అంటున్నారు. బావి లోపలకి దిగేందుకు అడుగు భాగం వరకు పూర్తిగా రాతి మెట్లు ఏర్పాటు చేశారు. మూడు వైపులా రాతి కప్పుతో బయటి నుండి చూసే వారికి కన్పించకుండా అందులో ఆరు గదులను సువిశాలంగా నిర్మించారు. ఎటు నుండి అయినా ఆరు గదుల్లో తిరిగేలా రహస్య మార్గాలను ఏర్పాటు చేశారు. అప్పటి రాజులు గదుల్లో నివాసం ఉంటూ వంట సైతం గదుల్లోనే చేసుకున్న పోయిరాళ్లు పొగచూరిన రాళ్ల ఆధారాలు నేటికి కన్పిస్తున్నాయి. ఇప్పటికీ ఈ ప్రాంతానికి చెందిన అనేక మంది పండుగల సమయంలో బావి వద్దకి వెళ్లి గదుల నిర్మాణం చూసి సంభ్యమాశ్చర్యాలకు గురవుతున్నారు. దశాబ్దాల కాలంగా బావి చెక్కు చెదరకుండా ఉండి బావిలో నీళ్లు ఉండటాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గత పదేళ్ల క్రిందటి వరకు డౌన్ బజారుకు చెందిన వారంతా రాజాబావి నీటినే తాగేవారు ప్రస్తుతం భావిలో నీరు చెట్ల ఆకులతో కలుషితం కావడంతో చెరువు వద్ద వేసిన చేతి పంపు నీటిని తాగుతున్నారు. ఎన్నో ఏళ్లుగా అధికారులు పట్టించుకోక పోవడంతో రాజాబావి చుట్టూ ఉన్న స్థలం కూడా ఆక్రమణకు గురవుతోంది. ఎన్నో ఏళ్ల చరిత్ర కల్గిన అతిపురాతన కాకతీయుల కాలం నాటి కట్టడం మరమ్మత్తులు చేయించి వెలుగులోకి తెస్తే పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుందని ఈ ప్రాంత ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



**గుప్త నిధుల కోసం తవ్వకాలు...**కాకతీయుల కాలంలో నిర్మించిన రాజాడావిలో గుప్త నిధులు ఉన్నాయనేది ఈ ప్రాంతంలో ఎప్పటి నుండో ప్రచారంలో ఉంది. దీంతో గుప్తనిధుల కోసం అన్వేషించే కొందరు ఈ భావిలోని గదుల్లో తరచూ తవ్వకాలు చేపడుతున్నారు. అధికారులు పట్టించుకుని పురాతన కట్టడాలను సంరంక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

## పారిశ్రామిక వాడ కోసం స్థల పరిశీలన



ప్రజాపక్షం/వెల్దుర్తి: మాసాయిపేట మండలంలోని అచ్చంపేట హకీంపేట గ్రామాల పరిధిలోగల అసైన్డ్ భూముల్లో పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసం మాసాయిపేట తహసిల్దార్ జ్ఞాన జ్యోతి ఆధ్వర్యంలో గిర్దవార్ ధన్ సింగ్, సర్వేయర్ నరసింహులు ఆధ్వర్యంలో అచ్చంపేట గ్రామ పరిధిలోగల 416.20 ఎకరాల అసైన్మెంట్ భూముల పరిశీలన రికార్డుల పరిశీలన పూర్తి చేశారు. ఇందులో 70 మంది రైతులకు చెందిన భూముల రికార్డులు అవకతవకలుగా ఉన్నందున సవరించడానికి నోటీసులు ఇచ్చామని తహసిల్దార్ జ్ఞానవతి తెలిపారు. మేడ్చల్ సిద్దిపేట టిజిఐఐ సి జోనల్ అధికారి, తూప్రాన్ ఆర్డీఓ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. త్వరలోనే హకీంపేట గ్రామ పరిధిలోగల 160 ఎకరాల భూసేకరణ కోసం కార్యచరణ చేపడతామని జ్ఞాన జ్యోతి చెప్పారు.

## చౌటుపల్లి నైట్ హాల్ట్ బస్సు నడపండి

ప్రజాపక్షం/మోర్తాడ్: నిజామాబాద్ జిల్లా కేంద్రం నుంచి మోర్తాడ్ మండల కేంద్రం మీదుగా చౌటుపల్లి గ్రామానికి వెళ్లే ఆర్టీసీ బస్సు గత చాలా రోజుల నుంచి రాత్రి ట్రిప్పు చౌటుపల్లికి వెళ్లడం లేనందున ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజుల క్రితం రాత్రి పది గంటలకు నిజామాబాద్ నుంచి చౌటుపల్లి బస్సు వచ్చేదని ఆ బస్సులో చాలామంది ప్రయాణీకులు అంకాపూర్, ఆర్మూర్, పెర్కెట్ లక్కోరా, అంక్సాపూర్, దొన్కల్, మోర్తాడ్, దోన్‌పాల్, ఆశ కొత్తూర్, బషీరాబాద్ వెళ్లే ప్రజలు చౌటుపల్లి బస్సులో వచ్చే వారని ఈ బస్సును ఆర్టీసీ అధికారులు రాత్రి ట్రిప్పు నిలిపి వేయడం వల్ల చాలా గ్రామాల ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని ప్రస్తుతం ఇప్పుడు రైతులు పండించిన పసుపు పంటను నిజామాబాద్ గంజుకు అమ్మకానికి తీసుకెళ్తున్నారు. కాబట్టి రాత్రి వేళలో గంజి నుంచి వచ్చే ప్రజలకు చాలా ఇబ్బందికరంగా ఉందని ఆర్టీసీ అధికారులు ప్రజల ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని నిజామాబాద్ నుంచి రాత్రి పది గంటలకు వచ్చే చౌటుపల్లి బస్సును పునఃప్రారంభించి ప్రజల కష్టాలు తీర్చాల్సిందిగా ఆయా గ్రామాల ప్రజలు ఆర్టీసీ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మోక్షం ఎన్నడో?

ప్రజాపక్షం / నందిపేట్ : నందిపేట్ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలిపోతుందని మండల విద్యార్థులు అంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని ఆర్మూర్ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కానీ ప్రభుత్వంమారినా కళాశాలకు మోక్షం లభించలేదు. మండలంలో అయిలాపూర్ గ్రామంలో ఒకే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉంది. నందిపేట్‌లో ప్రయివేటు కళాశాలలు ఉన్నాయి. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు డిగ్రీ చదవడానికి నిజామాబాద్, ఆర్మూర్ వెళ్ళాల్సి వస్తుందని యువజన కాంగ్రెస్ నాయకులు అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుపోయినా పలితం లేదు. మండలంలో మధ్య తరగతి కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. పేద కుటుంబాల విద్యార్తులు జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలల్లో ఫీజులు చెల్లించలేక చదువులు మానుకుంటున్నారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి కూడా విద్యార్తులు, యువజన నాయకులు తీసుకెళ్ళారు. ఎప్పుడు మోక్షం లభిస్తుందో చూడాలి...

## ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య



ప్రజాపక్షం/కౌటాల: మండల కేంద్రానికి చెందిన బొమ్మకంటి స్ఫూర్తి వయసు 16 అనే విద్యార్థిని శనివారం రాత్రి ఇంటిలో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. శనివారం మధ్యాహ్నం కాగజ్‌నగర్‌లోని ఫాతిమా పాఠశాలలో నవోదయ పరీక్ష రాసి తిరిగి ఇంటికి వచ్చిన అనంతరం మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలకు వెళ్లి, తిరిగి ఏడున్నర గంటలకు స్ఫూర్తి తండ్రి సదానందంతో ఇంటికి వచ్చింది. కూతురిని గంటలకు స్ఫూర్తి తండ్రి సదానందంతో ఇంటికి వచ్చింది. కూతురిని ఇంటిలో దింపిన ఆయన బయటికి వెళ్లాడు. స్టడి మెటిరియల్ ఫోన్లో పీడిఎఫ్ ఉందని ఫోన్ ఇవ్వాలని స్ఫూర్తి అమ్మ రమాదేవిని అడిగింది. నీకూ కావలసిన మెటిరియల్ జిరాక్స్ కాపి తీసుకు వస్తానని తల్లి జిరాక్స్ సెంటర్‌కు వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన స్ఫూర్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరెతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. జిరాక్స్ కోసం వెళ్లిన తల్లి రమాదేవి ఇంటికి వచ్చే సరికి ఫ్యాన్‌కు ఉరేసుకున్న బిడ్డను చూసి వెంటనే తండ్రి సదానందంకి ఫోన్ చేసింది. తండ్రి వచ్చి స్ఫూర్తిని కిందకు దింపి వెంటనే కౌటాల ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకి తీసుకెళ్లాడు. అక్కడ నుండి సిర్పూర్ టి ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తండ్రి సదానందం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు. విద్యార్థులు క్షణికావేశంతో తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోకూడదని, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరాలని కోరారు.

## వ్యక్తి బలవన్మరణం



ప్రజాపక్షం/శివ్వంపేట : శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరి వేసుకొని సంగారెడ్డి జిల్లా చిగురుప్ప గ్రామానికి చెందిన మధుముల నర్సింలు (38) అనే వ్యక్తి మృతిచెందాడు. మృతుడు నర్సింలు చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన అంజనేయులు ఇంటికి బంధువుగా వచ్చి ఆదివారం ఉదయం బయానచెరువు సమీపంలో ఉరివేసుకొని మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## నులి పురుగుల నివారణకు కృషి చేద్దాం




ప్రజాపక్షం/ఎడపలి: విద్యార్థులు, చిన్నారులలో నులి పురుగుల నివారణకు కృషి చేద్దామని వైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్ అన్నారు. శనివారం రెంజల్ మండలంలోని రెంజల్, నీలా గ్రామాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించి, డాక్టర్ వినయ్ కుమార్ మాట్లాడారు. నులి పురుగుల వల్ల కలిగే అనర్థాలను వివరించామన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం రోజున 119ఏళ్ల వారికి నివారణ మందులు వేయడం జరుగతుందని వైద్యాధికారి చెప్పారు. వయస్సు మట్టి మాత్ర మోతాదును ఇవ్వాలన్నారు. అల్బెండోజోల్ మాత్రను నమిలి మింగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కట్టా ఆంజనేయులు, పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు తాళ్ల సోపమలింగం గౌడ్, వైకిషోర్ కుమార్, విస్తీర్ణ అధికారులు చింతల శ్రావణ్ కుమార్, కరిపే రవీందర్, భీమయ్య, ఈశ్వర్, అనురాధ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గట్టెక్కేనా?

ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డిని ప్రకటించడంలో పార్టీ అంతర్యమేమిటి ?

-నిజామాబాద్ డిసిసికి స్థానిక సంస్థల ఎన్నికలు పెద్ద పరీక్ష

ప్రజాపక్షం/నిజామాబాద్‌ప్రతినిధి: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కలిసొస్తుందా ? అంటే మాత్రం కొంతవరకు కష్టమేనని భావిస్తున్నారు రాజకీయ విశ్లేషకులు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఇందిరమ్మ ఇల్లు, రైతు రుణమాఫీ 15 వేలు ఇస్తామన్న రైతు భరోసా 12 వేలు ఇస్తూ మండలంలో ఒక్క గ్రామానికి ఇవ్వటం, విడతల వారిగా ఇవ్వటం, రేషన్ కార్డులలో క్లారిటీ లేకపోవటంతో పాటు 6 గ్యారెంటీలు, పథకాలు పూర్తిస్థాయిలో అందకపోవటంతో ప్రజల్లో కొంత వ్యతిరేక మొదలైందని చెప్పాలి. పదేళ్లు అధికారం కోల్పోయిన నాయకులు స్వలాభం కోసం పార్టీలు మారిన, గ్రామస్థాయిలో కార్యకర్తలు పార్టీని మాత్రం వీడలేదు. సరైన సమయం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో అసెంబ్లీ ఎన్నికలు రావటంతో, పిసిసి అధ్యక్షులుగా రేవంత్రెడ్డి మాటలు కార్యకర్తల్లో నాయకుల్లో ఉత్తేజాన్ని నింపాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావటానికి పని చేశాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు భారీ మెజార్టీతో గెలిపించారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావటంతో నిజామాబాద్‌లోని కాంగ్రెస్ నాయకుల్లో మరింత ఉత్సాహం పెరిగిందని చెప్పాలి. గత పదేళ్లుగా గెలుపు ఎదురుచూస్తున్న నాయకులకు, కార్యకర్తలకు గెలుపు ఎంతో ఊతమిచ్చింది. అయినప్పటికీ ఆ సంతోషం, ఆ ఆనందం ఎక్కువకాలం లేకుండా పోతుందని అందుకు కారణం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు కారణం కాగా, జిల్లాస్థాయిలోని డీసీసీ అధ్యక్షులు జిల్లా స్థాయిలోని నాయకులను కార్యకర్తలకు అందుబాటులో లేకపోవటం మరొక కారణంగా చెప్పవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక నిజామాబాద్‌కు చైర్మన్ పదవులు కట్టబెట్టడంతో డీసీసీ అధ్యక్షునిగా ఉన్న మానాల మోహన్‌రెడ్డికి రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమించటంతో జిల్లా బాధ్యతలు పెద్దగా పట్టించుకోవటం లేదని నాయకుల్లో సమన్వయ లోపముందని కాంగ్రెస్ నాయకుల్లో చర్చ కొనసాగుతుంది. రేపుమాపో వేరే వారిని నియమిస్తారని, వాళ్లే చూసుకుంటారంటూ పలు సందర్భాల్లో మానాల మోహన్‌రెడ్డి సైతం బహిర్గతం చేచేయటం జరిగింది. జిల్లాస్థాయిలో ఉన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియామకం, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి ఉన్న కేశ వేణు ఇటీవల నుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంతో ఆ పోస్టు కూడా ఖాళీ అయింది. ఈ రెండు పోస్టులను కొత్తవారిని నియమించకపోవటంతో చేపట్టక జిల్లాలోని బీసీ సామాజిక వర్గం కొంత అసహనంతో ఉన్నారు. పార్టీలో ఉంటూనే అంటీముట్టనట్లు ఉంటున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

అత్యధిక జనాభా ఉన్న మున్నూరుకాపు, పద్మశాలిలకు జిల్లాస్థాయిలో పదవులు ఇవ్వకపోవటంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు నష్టం వాటిల్లే అవకాశాలున్నాయని, ఇప్పటికైనా రాష్ట్ర సిఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ కలుగజేసుకుని జిల్లాపై దృష్టి సారించలేకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో తీరని నష్టం వాటిల్లుతుందని పార్టీ కార్యకర్తల, నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యువతనే జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు ఒక తాటిపై వచ్చి యువతను రైతులను, మహిళలను ఆకర్షిస్తే తప్ప స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడం గగమని తెలుస్తోంది.

**కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డిని ప్రకటించడంలో ఆంతర్యమేమిటో ?**

ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాగైనా సత్తా చాటాలని కాంగ్రెస్ అధిష్ఠానం జిల్లా స్థాయి నేతలకు ఇదివరకే సీఎల్పీ సమావేశంలో చెప్పిన సంగతి విధితమే. కాగా జిల్లాలో మాత్రం అందుకు విరుద్ధంగా ఓటర్లు ఆలోచిస్తున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థిగా ఆల్ ఫోర్స చైర్మన్ నరేందర్‌రెడ్డికి అవకాశం ఇవ్వటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ అంటేనే నాయకులకు పుట్టినిల్లు కాంగ్రెస్‌లో నాయకులకు కొదవ లేదు.కాంగ్రెస్‌లో బలమైన నాయకుడు లేదని కాంగ్రెస్ భావిస్తుందా ? అని పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ కాంగ్రెస్‌లో పూర్తిస్థాయిలో పని చేస్తున్న నాయకులకు కాకుండా, పార్టీ నీ నమ్ముకుని ఉన్న వారికి కాకుండా బయట వారికి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంపై బీజేపీ, బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్‌లోనూ హాట్ టాపిక్‌గా మారింది. పైగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రత్యక్షంగా పోటీలో లేకపోవటం బీజేపీకి కలిసి వస్తుందా ? అని రాజకీయ విశ్లేషకులు ఆలోచిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని ఎదుర్కొనేందుకు నరేందర్‌రెడ్డి సరైనోడు అని కాంగ్రెస్ అధిష్ఠానం భావించిందా ? ఆర్థికంగా బలంగా ఉన్న నాయకుడు అయితేనే బాగుంటుందని కాంగ్రెస్ పార్టీ భావించిందా, ఏ పార్టీ అవకాశం ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని నరేందర్‌రెడ్డి పలు వేదికలపై చెప్పినప్పటికీ నరేందర్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తే కాంగ్రెస్‌కు గట్టి పోటీ అని భావించి, అంజిరెడ్డిని ఎదుర్కొనేందుకు నరేందర్‌రెడ్డిని రంగంలోకి దించారా అని పలు సందేశాలు ఎమ్మెల్సీ ఓటర్లలో రేకెత్తిస్తున్నాయి. ఏది ఏమైనా జిల్లా స్థాయిలో నాయకత్వం బలంగా తయారైతే తప్ప కాంగ్రెస్ పార్టీకి కలిసొచ్చే అవకాశాలు కనిపించడం లేదని ఇకనైనా అధిష్ఠానం ఆదిశగా అడుగులు వేస్తుందా లేదా అంటే వేచి చూడాల్సిందే.

## నేడు ఆర్మూర్‌లో త్రిపుర గవర్నర్ సిద్దుల గుట్ట సందర్శన



ప్రజాపక్షం/ఆర్మూర్ : త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి సోమవారం ఆర్మూర్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు శ్రీ అపురూప వెంకటేశ్వర స్వామి దేవాలయం గుత్ప పూజా కార్యక్రమం నిర్వహించిన అనంతరం 11 గంటలకు అంకాపూర్‌లోని లాలన వృద్ధాశ్రమం చేరుకుంటారు. 11.30 గంటలకు ఆర్మూర్‌లోని శ్రీ నవనాథ సిద్దేశ్వర ఆలయం సిద్దులగుట్టను దర్శించుకుంటారు. మధ్యాహ్నం 12 గంటలకు గవర్నర్ మిత్రుడైన ప్రముఖ న్యాయవాది లోక భూపతిరెడ్డి ఇంటికి చేరుకుంటారు.

## మల్లన్న జాతరకు ముస్తాబైన ఆలయం..



ప్రజాపక్షం/ముథోల్: ముథోల్ మండలం ఎడ్బిడ్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ మల్లన్న దేవుని జాతర మంగళవారం నుండి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ,గ్రామస్తులు తెలిపారు.ఈ జాతర 11వ తేదీనుండి 15వ తేదీ వరకు కొనసాగనున్నట్లు తెలిపారు.ఈ నెల 11న రాత్రి శ్రీ మల్లన్న దేవుని కళ్యాణ మహోత్సవం,12న చల్లని అంబళ్ళు,13న దేవుని పల్లకి ఊరెగిపు,14న కుస్తీ పోటీలు,రాత్రి అగ్నిగుండా ప్రవేశం,సుమారు రూ.లక్షతో కుస్తీ పోటీలు నిర్వహిస్తారు.తె లుగు రాష్ట్రాల నుండే కాకుండా మహారాష్ట్ర నుండి సైతం మల్లయోధులు తరలివస్తారు. కుస్తీ పోటీల్లో మొదటి విజేతకు 10వేల నగదు, 50 గ్రాముల వెండికడియం, రెండవ విజేతకు 5వేల నగదు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 15న అడపడుచుల జాతర, అంబలి కుండా ఇంటికి తేవడంతో జాతర ముగుస్తుంది.ఈ జాతరకు బైంసా నుండి ప్రత్యేక బస్సులు నడుపబడుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ గ్రామంలో ప్రతి సంవత్సరం దేవుని కళ్యాణం జరిగిన తర్వాతనే గ్రామంలో పెళ్లి కార్యక్రమాలు చేయడం ఆనవాయితిగా వస్తుంది.ఈ జాతర ఉత్సవాలు ఆలయ కమిటీ గ్రామ పంచాయతీ,గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## కల్తీ వస్తువులు విక్రయిస్తున్న వారిపై చర్యలేవీ?



ప్రజాపక్షం/ఖానాపూర్: ఖానాపూర్ మండలంలోని సూపర్ మార్కెట్లలో కల్తీ వస్తువులు విక్రయిస్తున్నారని, అటువంటి వారిపై సబంధిత అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ నిర్మల్ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ ఆర్ ఉపాలి అన్నారు. ధనార్జనే ధ్యయంగా, ప్రజల ప్రాణాలతో పని లేకుండా కల్తీ నూనెలు, గంటల తరబడి ఉడికించినా ఉడకని పప్పులు, నూక బియ్యం,ముక్క బియ్యం, నాసికం పల్లీలు, కుడకలు, రకరకాల నిత్యవసర దినుసులు అమ్ముతున్నారని ఆయన ధ్వజమెత్తారు. కొందరు గిర్నీ ద్వారా పట్టిన స్వచ్ఛమైన నూనెను అమ్ముతున్నామని చెబుతూ, దూర ప్రాంతాల నుండి తెచ్చిన రకరకాల నూనెలను అమాయకులకు అంటగడుతున్నారని అన్నారు. ఆరోగ్య ప్రధాయిని అయిన అల్లం వెల్లుల్లి ధరలు ఆకాశాన్నంటిన ఈ తరుణంలో 20 రూపాయలకు 100 గ్రాముల అల్లం వెల్లుల్లి పేస్ట్ డబ్బాను ఎలా అమ్ముతారని ప్రశ్నించారు. సంబంధిత అధికారుల తనిఖీలు నిర్వహించకపోవడంతో కల్తీ వస్తువులు రాజ్యమేలుతున్నాయని అన్నారు. ఇలా రకరకాల కల్తీ వస్తువులను అమ్ముతున్న విక్రయదారులపై సంబంధిత పౌరసరఫరలా కమిషనర్ తక్షణమే కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన డియాండ్ చేసినారు. లేని యెడల కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## నందిపేట్ మునిసిపాలిటీ ఏర్పాటుకు ప్రయత్నాలు




ప్రజాపక్షం/నందిపేట్: నందిపేట్ మండల ప్రజలు ఎన్నో ఏళ్లుగా కలలు కంటున్న వీరి కోరిక తొందరలో నెరవేరపోతుంది. ప్రజాప్రతినిధులను వినతి పత్రాలతో ముంచెత్తిన వీరి పోరాటానికి ప్రభుత్వం ఎట్టకేలకు కరుణించి మునిసిపాలిటి ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని మండల రెవెన్యూ అధికారులను, మండల అభివృద్ధి అధికారిని కోరింది. నందిపేట్ మునిసిపాలిటిలో చేరడానికి ఏ గ్రామాలు ముందుకు వస్తాయో ఆ గ్రామం నుంచి మాకు ఎలాంటి అభ్యంతరం లేదని తీర్మానంచేసి అధికారులకు ఇవ్వాలని కోరింది. ఇలా చేస్తే మునిసిపాలిటి ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుంది. ఈ ప్రక్రియ గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది. ప్రభుత్వం చిన్నచూపు, ప్రజాప్రతినిధుల పట్టింపులేకపోవడంతో అర్థాంతరంగా మధ్యలోనే నిలిచిపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని మునిసిపాలిటిల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. నందిపేట్ మునిసిపాలిటి గురించి ప్రతిపాదనల గురించి ఆరా తీసింది. వచ్చే స్థానిక ఎన్నికలలోగా ఏర్పాటుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. నందిపేట్ గ్రామం చుట్టు బజార్ కొత్తూరు, శాపూర్, లక్కంపల్లి, చింరాజ్ పల్లి గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలలో జనాభా 15 వేలు ఉండేది. ప్రస్తుతం సుమారు 17 వేలు వరకు చేరుకుంది. అంతే కాకుండా నందిపేట్ మేజర్ గ్రామ పంచాయతీ ఆదాయం రోజు వారి సంత, తైబజార్, ఇంటి, దుకాణాలపై వచ్చే ఆదాయం సుమారు 60 లక్షల వరకు ఉంది. నందిపేట్ మండల కేంద్రం ఆర్థికంగా, వ్యాపారపరంగా ఎంతో అభివృద్ధి సాధిస్తుంది. ఈ విషయాలన్ని పరిశీలించిన ప్రభుత్వం మునిసిపాలిటి ఏర్పాటు గురించి ప్రయత్నాలు ప్రారంభించినట్టు అధికారుల ద్వారా తెలిసింది. మునిసిపాలిటి అయితే సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ఉండరు. వారి స్థానంలో కౌన్సిలర్‌లు వస్తారు. మునిసిపాలిటి వల్ల గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయి. రోడ్లు, మురికి కాలువలు, ఇతర సౌకర్యాలు మెరుగవుతాయి. ఏదేమైనా మునిసిపాలిటి ఏర్పాటుకు అన్ని పార్టీల నాయకులు పోటీపడుతున్నారు.

## పెరుగుతున్న జిబిఎస్ వ్యాధి కేసులు..

జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందా..?

ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌లో వైద్యం అందించాలి

ప్రజాపక్షం/నిజామాబాద్: గులియన్ బారీ సింద్రోమ్ (జీబీఎస్) అనే నరాల వ్యాధి కేసులు జిల్లాలో పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మూడు, నాలుగు కేసులు వైద్యం పొందుతున్నట్లు సమాచారం, కాగ శనివారం సిద్దిపేట జిల్లా సిద్దిపేట గ్రామీణ మండలం సీతారాంపల్లికి చెందిన వివాహిత(25) హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. ఈ వ్యాధి బారిన పడ్డ వారికి నరాల నొప్పులతో లేవలేని, నడవలేని పరిస్థితికి రావడం, నరాల బలహీనతకు గురి కావడం లక్షణాలుగా చెప్పవచ్చు. ఇటీవల మహారాష్ట్రలోని పుణెలో 'జీబీఎస్' కారణంగా పలువురు మృతిచెందగా




ఇప్పటికీ చాలామంది అసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మన రాష్ట్రంలో ఈ వ్యాధితో మరణం సంభవించడం సిద్దిపేట్ జిల్లాకు చెందిన మహిళా మృతి మొదటిదని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో ఇదివరకే కేసులు పెరుగుతున్న సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ వైద్యం కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ వ్యాధి బారిన పడ్డవారికి వైద్య ఖర్చులకు లక్షల్లో ఖర్చు అవుతుందని, ప్రభుత్వం వెంటనే ఇలాంటి వ్యాధులకు ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ కింద ఉచితంగా వైద్యం అందించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## నస్కల్‌కు బిటి రోడ్డు వేయకుంటే మళ్లీ ధర్నా



ప్రజాపక్షం/నిజాంపేట్: మండల కేంద్రం నుండి రాంపూర్, నస్కల్, నందగోకుల్, చల్మెడ గ్రామాలకు బీటీ రోడ్డు వేయాలని గత నెల జనవరి 11వ తేదీ నుండి దాదాపు 15 రోజులు రిలే నిరాహార దీక్షలు చేయడం జరిగింది. రోడ్డు బాగు చేయాలని ప్రమాదాలు జరుగుతున్నాయని అంబులెన్స్ రావడం లేదని ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ద్విచక్ర వాహనాలు స్కిడ్ అయి ప్రాణాలు పోతున్నాయని రిలే దీక్షలు చేయడం జరిగింది. అందుకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పెట ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో ఆగమేఘాల మీద మైనంపల్లి హనుమంతరావు తో మాట్లాడడం జరిగిందని, అన్న చెప్పిన మాట ప్రకారం 15 రోజులు సమయం ఇవ్వాలని రిలే దీక్షలు అక్కడికి వచ్చి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేసిన నాయకులు నేటికి 15 రోజులు కావొస్తుంది అయినా నాయకుల మాటలు నీతి మూటల్లాగే మిగిలిపోయానని గ్రామానికి సంబంధించిన ప్రజలు యువకులు మాట్లాడుతున్నారు. రిలే నిరాహార దీక్షలు చేస్తున్న వారిని సముదాయించి 15 రోజులలో బీటీ రోడ్డు వేయిస్తానని తామే దగ్గర ఉండి పనులు ప్రారంభిస్తామని పనులు పూర్తయ్యేవరకు విడిచి పెట్టే ప్రసక్తే లేదని ప్రగల్బాలు వలికిన నాయకులు కనబడటం లేదని ఎద్దేవ చేస్తున్నారు. కనీసం మెటీరియల్ రాలేదని, వాహనాలు కూడా రాలేదని వారు నిరాశ వ్యక్తం చేశారు. ఈనెల 10 తారీకు వరకు రోడ్డు పనులు మొదలుపెట్టనీ ఎడల కాంగ్రెస్ పార్టీకి చెందిన చప్పెట ముత్యంరెడ్డి ఇంటి దగ్గర నిరసన కార్యక్రమం చేస్తామని అన్నారు. మళ్లీ రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తామని వారు పునరుద్ఘాటించారు. అదే విధంగా రాబోయే ఎన్నికల్లో గ్రామపంచాయతీ నుండి సర్పంచి గాని ఎంపీటీసీలకు గాని పోటీ చేయనీయకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దేశెట్టి లింగం, దుబాసి సంజీవ్, దుర్గయ్య, పాగల ఎల్లం యాదవ్, మహమ్మద్ రఫీక్, గొల్ల మల్లయ్య, గందె రాములు, అబ్దుల్, ఖాసిం, గౌస్, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పచ్చని చెట్లపై గొడ్డలి వేటు..!

మామూళ్ల మత్తులో అటవీ అధికారులు...

ప్రజాపక్షం/కుంటాల: దట్టమైన అడవులకు పేరుగాంచిన కుంటాల మండలంలో అటవి సంపద అంతరించిపోతుంది.అడవుల సంరక్షణకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుండగా సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో వచ్చని చెట్టపై గొడ్డలి వేటు పడుతుంది.అటవి అధికారులు మామూళ్ళ ధనదాహానికి అడవులు అంతరించిపోయే ప్రమాదం ఉందని మండల వాసులు ఆరోపిస్తున్నారు.

**పర్మిట్ పేరుతో అక్రమ రవాణా..**

కుంటాల మండలంలోని దౌనెల్లి, అంబాకంటి, అంబుగాం, మేదన్ పూర్, సూర్యాపూర్, తదితర గ్రామాల నుండి నిత్యం కలపను లారీలతో తరలిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. పట్టా భూముల్లో పరిమిషన్ తీసుకొని చెట్లను నరికివేసి తరలిస్తున్నారని అటవీ అధికారులు భుకాయిస్తున్నారు. అంబుగాం, మేధన్ పూర్, అటవి శివారులో కలప స్మగ్లర్ల వద్ద అటవి అధికారులు మాముళ్ళు తీసుకొని పరోక్షంగా సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా మేదన్ పూర్ గ్రామంలో గ్రామస్తులు అక్రమంగా తరలిస్తున్న కలప లారీని పట్టుకొని డీఎఫ్ఓ నాగిణి భానుకు ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక అటవి అధికారులు ఆందోళనకు గురి అయి డీఎఫ్ఓ ఆదేశాలతో పట్టుకున్న లారీని బైంసా రేంజ్ అఫీసుకు తరలించారు.కుంటాల మండలంలో గత కొన్ని నెలలుగా బైంసా నుండి



వస్తున్న స్మగ్లర్లు అటవీ అధికారులపై కమ్మకై విలువైన కలపను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.ఇప్పటికైనా సంబంధిత జిల్లా స్థాయి అధికారులు స్పందించి పరిమిట్ల మాటున తరలిస్తున్న అక్రమ కలప రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## అవినీతి పార్టీలను తిరస్కరించిన ప్రజలు

ఎంపి రఘునందన్ రావు

ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి: పది సంవత్సరాలలో అవినీతి చేసిన బిఆర్ఎస్,ఢిల్లీ ఆమ్‌ఆద్మీ పార్టీలను ప్రజలు



తిరస్కరించారని,దేశంలో కాంగ్రెస్ పార్టీ పని ఖతం అయ్యిందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి ఎమ్మెల్సీ అభ్యర్థులు కరువయ్యారని, త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి పార్టీ విజయం సాధిస్తుందని, ముక్త్ భారత్ సాధించడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ పనిచెస్తున్నారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. ఢిల్లీలో కేజ్రీవాల్ చెల్లె కవితతో కలిసి సీసాలు అమ్మి శీష్ మహల్ నిర్మించాడని ఆరోపించారు. మెదక్ లో బీజేపీ కార్యాలయంలో మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతుగా మండల పార్టీ అధ్యక్షుల తో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంపీ హాజరై మాట్లాడారు. అన్నాహజారే శిష్యుడిగా అవినీతిపై పోరాటం చేస్తానని వచ్చిన కేజ్రీవాల్ పాలన అంతా అవినీతి బురదలో మునిగిందన్నారు. చెల్లె కవితతో కలిసి సీసాలు అమ్మితే వచ్చిన డబ్బుతో కేజ్రీవాల్ శీష్ మహల్ పేరుతో అద్దాల మెడ నిర్మించాడని ఆరోపించారు. మహల్ లో నిర్మించిన టాయిలెట్స్‌కు రూ. 50 కోట్లు ఖర్చు చేయడం పై ఢిల్లీ ప్రజల్లో ఆగ్రహం తెచ్చేందుకు ప్రధాన కారణంగా చెప్పారు. అవినీతి మరక ఉన్నా ఏ పార్టీకి ప్రజలు దగ్గరకు తీయలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తో పాటు కేసీఆర్ ప్రభుత్వం కార్ల కొనుగులు లో కూడా అవినీతికి పాల్పడిందని విమర్శించారు. పప్పు యాదవ్ గురించి మాట్లాడడానికి ఏమి లేదన్నారు. ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ సారి కూడా కాంగ్రెస్‌కు గాడిద గుడ్డు సున్నానే వచ్చిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఢిల్లీ లో ఉన్న ఏడు సీట్లకు ఏడు బీజేపీ యే గెలిచిందని, గత కొన్ని పర్యాయాలుగా అక్కడి ప్రజలకు కాంగ్రెస్‌కు గుండు సున్నాకే పరిమితం చేస్తున్నారన్నారు. మూడు రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం వస్తే ముక్త్ భారత్ సాధిస్తామని చెప్పారు. 125 ఏళ్ల చరిత్ర ఉన్న పార్టీగా చెప్పే కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేసిందని ప్రశ్నించారు. బీజేపీ పాలనలో మోడీ 370 ఆర్టికల్ రద్దు చేశాడని, రామ మందిరం నిర్మాణం చేశాడని, రోజుల ఆరు కోట్ల మంది వస్తున్న మహా కుంభమేళా ను విజయవంతంగా అక్కడి ప్రభుత్వం కొనసాగిస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నింటా విఫలమైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, బీజేపీ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి, పంజా విజయ్ కుమార్, నాయిని ప్రసాద్,నల్లాల విజయ్, ఎం.ఎల్.ఎన్ రెడ్డి, మధు, శివ ఉన్నారు.

